## హార్మూజ్ జలసంధిలో నౌకపై దాడి..



2లో



# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 | సంచిక:41 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | బుధవారం , అక్టోబర్,07, 2026 | పేజీలు:12 | వెల:10రూ/-




## ఉదయ్ కృష్ణారెడ్డి విడుదల

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**సహచర మహిళా అధికారి ఫిర్యాదుతో గతంలో అరెస్ట్లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఊరట లభించింది. సుమారు 67 రోజులుగా జైల్లో ఉన్న ఆయనకు హైదరాబాద్లోని ఉప్పరపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు.గతంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన సహచర మహిళా ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు.అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా ఈ కేసులో విచారణ జరిపిన ఉప్పరపల్లి కోర్టు, ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి బయటకు వచ్చారు.

## తమిళనాడు సీఎం విజయ్ను కలిసిన టీడీపీ ఎంపీలు

- తమిళనాడు సీఎం విజయ్తో టీడీపీ ఎంపీల బృందం భేటీ
- విజయవాడలో జరిగే 'విజయవాడ ఉత్సవ్'కు ప్రత్యేక ఆహ్వానం
- లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో విజయ్ని కలిసిన పలువురు ఎంపీలు



**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ను తెలుగుదేశం పార్టీ ఎంపీల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. విజయవాడలో నిర్వహించనున్న 'విజయవాడ ఉత్సవ్'కు ఆయనను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ విషయాన్ని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు.లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలోని ఈ బృందంలో ఎంపీలు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కేశినేని శివనాథ్, జి.ఎం.సి. హరీశ్ బాలయోగిలతో పాటు విజయవాడ ఉత్సవ్ కమిటీ ఛైర్మన్ కె. మురళి ఉన్నారు. ఈ భేటీ ఎంతో ఆత్మీయంగా, చిరస్మరణీయంగా జరిగిందని శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. సీఎం విజయ్ చూపిన వినయం, ఆప్యాయత, సౌజన్యం తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు.తెలుగు, తమిళ ప్రజల మధ్య సరిహద్దులకు అతీతమైన సాంస్కృతిక, కళా, సినీ, సంప్రదాయ బంధం ఉందని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఈ స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు 'విజయవాడ ఉత్సవ్' ఒక అద్భుతమైన వేదిక అని ఆయన వివరించారు. ఈ వేడుక కోసం విజయ్ను విజయవాడకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని, ఆయన రాక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.ం

## తెలంగాణలో ఎల్నినో ప్రభావం

- సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం
- కరవుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానం

**ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి సుమారు రూ. 1200 కోట్ల ఆదా**

- కొత్త స్టీల్ బ్రిడ్జికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్
- కొత్తగా స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం
- వచ్చే ఏడాదికల్లా కొత్త వంతెన పూర్తి చేస్తామన్న జీహెచ్ఎంసీ




**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** హైదరాబాద్లోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ గతంలో ప్రతిపాదించిన బహుళ ఫ్లైఓవర్లు, అండర్పాస్ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో సరికొత్తగా డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన

2లో..

## బార్ల యజమానులకు నష్టం లేదు.. :జూపల్లి

- వినియోగదారులపై స్వల్ప భారం: మంత్రి జూపల్లి
- ప్రివిలేజ్ ఫీజుతో బార్ల యజమానులకు నష్టం లేదన్న మంత్రి జూపల్లి
- వినియోగదారులపై పడేది స్వల్ప భారమేనని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ హయాంలో మద్యం ఆదాయం 260 శాతం పెరిగిందని వెల్లడి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్:** రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్ల యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, వినియోగదారులపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఆయన స్పందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మద్యం ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందే తప్ప, వినియోగం పెద్దగా తగ్గదని గత అనుభవాలు చెబుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరం అప్గ్రేడ్ అయినందున, ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగానే ఇక్కడా బార్ లైసెన్సులను జారీ చేశామని తెలిపారు.

2లో..



## వైఎస్ జగన్కు 'స్థితప్రజ్ఞుడు' పుస్తకం బహుకరణ

**తాడేపల్లి , ట్రైనెట్ న్యూస్:** వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో రచయిత కొత్తపల్లి శ్రీనివాస వర్మ భేటీ అయ్యారు. మంగళవారం వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను రచించిన 'స్థితప్రజ్ఞుడు' పుస్తకాన్ని బహుకరించారు.వైఎస్ జగన్ రాజకీయ జీవనయానం, ఆయన ప్రస్థానంలోని వివిధ ఘట్టాలు, నాయకత్వ లక్షణాలను సమగ్రంగా వివరిస్తూ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో రచయితతో పాటు ఆయన సతీమణి లక్ష్మీ రాధ, ఎంవీఎస్ నాగిరెడ్డి, రమేష్, కొవ్వూరి త్రినాథరెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

**నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని లక్ష్యం**

- రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు
- గత నెలలో రూ.1,345 కోట్ల పనులు జరిగాయని అధికారులు వెల్లడి
- ఔటర్ రింగ్ రోడ్డుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం
- ప్రస్తుతం 41 వేల మంది కార్మికులతో కొనసాగుతున్న పనులు



- మహిళలతో పాటు ఆర్టీసీ సిబ్బందికి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్లో మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు

2లో..

## మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత

- ప్రజాసేవ చేసేందుకు మాజీ మావోలు తమ పార్టీలో చేరాలన్న కవిత
- వేములవాడ ఆలయంలో మేత, నీరు లేక గోవులు మరణిస్తున్నాయని ఆవేదన
- కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని వ్యాఖ్య

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్:** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులు ప్రజాసేవ



2లో..

## బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు వెళుతోంది

- మంత్రి మండిపల్లి
- బీసీల సంక్షేమంపై వైసీపీకి చిత్తశుద్ధి లేదన్న మండిపల్లి
- 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామన్న మంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే విజయమని ధీమా

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో



వెనుకబడిన తరగతులకు

2లో..

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానం

మొదటి పేజీ తరువాయి

కార్యదర్శి జయేష్ రంజన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు రూ. 1,200 కోట్ల ప్రజాధనం ఆదా కానుంది.సవరించిన ప్రణాళిక ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫఖంజా కాలేజీ వరకు ఆరు లేన్ల స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి) నిర్మించనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.1 వైపు వెళ్లేందుకు వీలుగా దీనికి ఒక ర్యాంప్‌ను కూడా అనుసంధానిస్తారు. గతంలో ఈ పనులకు సంబంధించి కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన 'లెటర్ ఆఫ్ అవార్డు'ను ఉపసంహరించుకుని, కొత్త డిజైన్ బాధ్యతలను మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించారు. భూసేకరణ వ్యయం తగ్గడం వల రూ. 800 కోట్లు, నిర్మాణ ఖర్చు తగ్గడం వల్ల మరో రూ. 400 కోట్లు కలిపి మొత్తం రూ. 1200 కోట్లు ఆదా అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ ప్రాజెక్టుపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ గతంలో తలపెట్టిన హెచ్-సిటీ పనులను రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వన్-వే విధానం సత్ఫలితాలను ఇస్తుండటంతో దానినే శాశ్వతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం



ఆదా అవుతుందని, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు లేన్ల స్టీల్ బ్రిడ్జిని నిర్మించి, వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్ల నరికివేతపై కోర్టు ఆంక్షల కారణంగా పాత ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగింది. మాదాపూర్, హైటెక్ సిటీ వైపు వెళ్లే వాహనదారులకు సిగ్నల్-ఫ్రీ ప్రయాణాన్ని కల్పిస్తూనే, పార్క్‌లోని పచ్చదనానికి కనీస నష్టం కలగకుండా ఈ సరికొత్త కారిడార్‌ను ప్రభుత్వం రూపొందించింది.

## మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత

మొదటి పేజీ తరువాయి

చేసేందుకు తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. వారి రాకతో తమ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.పర్యటనలో భాగంగా, వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కవిత పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణంలో కాంక్రీట్ వాడటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆగమశాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో నిర్మిస్తేనే ఆలయం వందల ఏళ్లపాటు నిలుస్తుందని, చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తులు సమర్పించిన గోవులు సరైన మేత, నీరు లేక మరణిస్తున్నాయని, వాటికి కనీసం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు కూడా జరపడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు."అడవిని వదిలేసి వచ్చిన మాజీ మావోయిస్టులు ప్రజా జీవితంలోకి రండి.. మా పార్టీ మీకు మంచి ప్లాట్‌ఫామ్" అని కవిత పిలుపునిచ్చారు.

## బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు వెళుతోంది

మొదటి పేజీ తరువాయి

(బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే భయంతోనే వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రజల్లోకి వెళ్లి పనిచేసే సత్తా వైసీపీకి లేదని, ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా ఆరోపణలు చేయడం, కేసులు వేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని మంత్రి విమర్శించారు. బీసీల సంక్షేమం, వారి రాజకీయ సాధికారతపై వైసీపీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు, రాజ్యాంగ హక్కులకు అనుగుణంగానే తమ కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి అందాయని, 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని మండిపల్లి వివరించారు. గృహ నిర్మాణం, ఉద్యానవన రంగాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీలు పూర్తి సన్నద్ధంగా ఉన్నాయని, ప్రజల మద్దతుతో వార్డు స్థాయి నుంచి మేయర్ పదవి వరకు నిర్ణయాత్మక విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## శ్రీశైలం దేవీ శరన్నవరాత్రులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు ఆహ్వానం



- శ్రీశైలంలో దసరా ఉత్సవాలు
- అక్టోబర్ 11 నుంచి 20 వరకు పది రోజుల పాటు వేడుకలు
- తొమ్మిది రోజుల పాటు నవదుర్గ రూపాల్లో దర్శనమివ్వనున్న భ్రమరాంబిక
- ప్రతిరోజూ చండీయాగం, రుద్రయాగం, ప్రత్యేక వాహన సేవలు
- విజయదశమి రోజున తెప్పోత్సవంతో ఉత్సవాల ముగింపు

**ఢిల్లీ,అమరావతి, ట్రైనెట్ న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో జరగనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లకు దేవస్థానం ఆహ్వానం పలికింది. ఈ మేరకు దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు ఇవాళ ఉండవల్లిలో వారిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఈ నెల అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఉత్సవాల సందర్భంగా శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారు తొమ్మిది రోజుల పాటు నవదుర్గ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. అంతేకాకుండా, ప్రతిరోజూ నవావరణ పూజలు, చండీయాగం, రుద్రయాగం, కుంకుమార్చనలు, చతుర్వేద పారాయణలు, సువాసిని-కుమారీ పూజలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ రాత్రి వేళల్లో స్వామి అమ్మవార్లకు వివిధ వాహనాలపై గ్రామోత్సవం కన్నుల పండువగా జరుపుతారు.

## ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

మొదటి పేజీ తరువాయి

పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభమైన స్త్రీశక్తి పథకం, 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలను పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణం. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే ఈ పథకం వారి జీవితాల్లో ఎంతగా భాగమైపోయిందో అర్థమవుతోంది" అని తెలిపారు.చదువుకునే విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే వారికి ఉచిత బస్సు ప్రయాణం ఎంతో శక్తినిచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, తమ అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే భరోసాను ఈ పథకం అందిస్తోందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా మహిళలు రూ.3,550 కోట్ల మేర ఆదా చేసుకున్నారని, ఇలా ఆదా అయిన ప్రతి రూపాయి వారి పిల్లల చదువుకు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి వివరించారు.ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధ్యం చేసినందుకు రాష్ట్రంలోని మహిళలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా, పథకం విజయవంతం కావడంలో అహర్నిశలు కృషి చేసిన ఆర్టీసీ యాజమాన్యానికి, సిబ్బందికి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.2024 ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీ శక్తి పథకం ముఖ్యమైనది. ఈ పథకాన్ని 2025 ఆగస్టు 15 నుంచి అమల్లోకి తెచ్చారు.

## బార్ల యజమానులకు నష్టం లేదు.. :జూపల్లి

మొదటి పేజీ తరువాయి

ఈ కొత్త రుసుము బార్ యాజమాన్యాలకు నష్టం కలిగించేది కాదని ఆయన పునరుద్ఘాటించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయం రూ.10,000 కోట్ల నుంచి రూ.36,000 కోట్లకు, అంటే దాదాపు 260 శాతం పెరిగిందని జూపల్లి గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం ఆదాయం ప్రస్తుతం రూ.40,000 కోట్లుగా ఉందని వివరించారు. ప్రభుత్వం చట్ట ప్రకారమే ముందుకు వెళుతోందని, మద్యం ఉత్పత్తికి నీటి కొరత ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు.

# హర్మూజ్ జలసంధిలో నౌకపై దాడి..

- 11 మంది భారత నావికులకు గాయాలు
- హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై మరోసారి దాడి
- పనామా నౌకపై దాడిలో 11 మంది భారతీయులకు గాయాలు
- గాయపడిన సిబ్బందిని ఒమన్ ఆసుపత్రికి తరలించి చికిత్స
- నౌకలపై దాడులను తీవ్రంగా ఖండించిన భారత ప్రభుత్వం
- ఈ దాడులు వెంటనే ఆగాలని, శాంతిని నెలకొల్పాలని భారత్ డిమాండ్



**ఢిల్లీ,అమరావతి, ట్రైనెట్ న్యూస్:** ఒమన్ తీరంలోని హర్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ జలసంధి గుండా ప్రయాణిస్తున్న పనామా జెండాతో కూడిన 'ఎంటీ ఆన్ పీస్' అనే వాణిజ్య నౌకపై మంగళవారం రాకెట్ దాడి జరిగింది. ఈ ఘటనలో 11 మంది భారత నావికులతో సహా మొత్తం 12 మంది సిబ్బంది గాయపడ్డారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.ఈ నౌకలో మొత్తం 19 మంది సిబ్బంది ఉండగా, వారిలో 17 మంది భారతీయులే. దాడి జరిగిన వెంటనే ఒమన్ అధికారుల సహకారంతో గాయపడిన వారిని సమీపంలోని ఖసాబ్ నగరంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నౌకపై జరిగిన ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. బాధితులను ఆసుపత్రికి తరలించడంలో సహకరించిన ఒమన్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసింది.ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై దాడులు కొనసాగుతుండటంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పౌర మౌలిక సదుపాయాలు, వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని తక్షణమే నిలిపివేయాలని, అంతర్జాతీయ జలమార్గాల్లో నౌకాయానం, వాణిజ్యం సజావుగా సాగేలా చూడాలని పిలుపునిచ్చింది.

# బీసీలపై వైకాపాకి ఎందుకంత కక్ష: కేంద్రమంత్రి రామ్మోహన్

- ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చలు జరిపిన టీడీపీ నేతలు
- బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని రామ్మోహన్ నాయుడు ప్రశ్న
- బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మండిపాటు



**ఢిల్లీ,అమరావతి, ట్రైనెట్ న్యూస్:**ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సుప్రీంకోర్టులోనూ పూర్తి అవకాశం ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ లక్ష్యంతోనే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. ఢిల్లీలో ఈరోజు న్యాయనిపుణులతో అచ్చెన్నాయుడు, అనగాని సత్య ప్రసాద్, పార్థసారథి, రామ్మోహన్ నాయుడు చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని ప్రశ్నించారు. వారికి రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 34 శాతం కోటాను పునరుద్ధరిస్తే బీసీలకు సుమారు 16,800 పదవులు దక్కుతాయని... ఇది రాజకీయ అంశం కాదని, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. కొన్ని రాష్ట్రాలు బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే మార్గాలను అన్వేషిస్తున్నాయని, ప్రభుత్వం కూడా సమస్యను జటిలం చేయకుండా పరిష్కారం కోసం చూస్తోందని వివరించారు.మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం చట్టాన్ని సవరించకుండానే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు తగ్గించిందని నిలదీశారు. దీనివల్ల వేలాది మంది బీసీ నేతలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 1987లో టీడీపీనే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిందని, ఆ తర్వాత చంద్రబాబు హయాంలో దాన్ని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు.

## తెలంగాణలో కరవు పరిస్థితులు.

మొదటి పేజీ తరువాయి

ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళనకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని 18 జిల్లాల్లో గల 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది.ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జల, వ్యవసాయం, పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు. నైరుతి రుతుపవనాల 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# అక్టోబర్ 7న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు విడుదల

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అక్టోబర్ 12, 13, 14, 18, 19, 20వ తేదీలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను అక్టోబర్ 7న బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ లో విడుదల చేయనున్నట్టు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. భక్తులు ఈ టికెట్లను https:// ttdev-asthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అక్టోబర్ 11 నుంచి 20 వరకు వీఐపీ బ్రేక్, ప్రివిలేజ్డ్ దర్శనాలు



రద్దు చేస్తున్నట్టు తెలిపింది. అక్టోబర్ 11 నుంచి 20 వరకు తిరుమలలో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలతో పాటు పెరటాసి మాసం చివరి వారం కావడంతో భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ 10 రోజుల పాటు ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, డిఫెన్స్ దర్శనాలను రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి అక్టోబర్ 10 నుంచి 19 వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తెలిపారు.

# స్థానిక ఎన్నికలపై కీలక చర్చ



**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**
ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌కు చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్వాగతం పలికారు. చాలా రోజుల తర్వాత ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ముగ్గురూ కలిసి బ్రేక్ ఫాస్ట్ చేస్తూ స్థానిక ఎన్నికలపై చర్చిస్తున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కూటమి పక్షాల మధ్య సమన్వయం, కలిసి పోటీ చేయడం, రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలతో పాటు నియోజకవర్గ స్థాయి కమిటీల నియామకంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. పర్సంటేజ్‌లతో సంబంధం లేకుండా పొత్తులతో ఎవరికి బలమున్న ప్రాంతాలలో వారు పోటీ చేయాలని నేతలు భావిస్తున్నట్లు సమాచారం.
గెలుపే ధ్యేయంగా మూడు పక్షాలు పని చేయాలనీ ఇప్పటికే నేతలు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఏ ఒక్క స్థానం కూడా వైసీపీకి దక్కకుండా చేయాలని నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో తొలిదశలో జరిగే నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలపై ఇరువురు నేతల మధ్య ప్రధానంగా చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది. అలాగే, రాబోయే శుక్రవారం సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణకు వస్తున్న నేపథ్యంలో దానిపై కూడా ఇరువురు చర్చించనున్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన వెంటనే ఏ క్షణ లోనైనా స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అంశంపైనా నేతల మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

# దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి: గోలి ప్రభాకర్





**నల్గొండ, అక్టోబర్ 6, ట్రైనెట్ న్యూస్:**
కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో-కన్వీనర్ గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన పూర్తయినా దివ్యాంగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు.
మంగళవారం నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో దివ్యాంగుల విభాగం జిల్లా కన్వీనర్ రాపోలు సంతోష్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు నెలకు రూ.6,000 పింఛన్, ఉచిత బస్సు ప్రయాణం, 80 శాతం సబ్సిడీతో రుణాలు, ప్రత్యేక శాఖ ఏర్పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 శాతం రిజర్వేషన్ వంటి హామీలను కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించిందన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం--2016ను సమర్థంగా అమలు చేస్తామని కూడా హామీ ఇచ్చిందని తెలిపారు.
32 హామీలు ఇచ్చి దివ్యాంగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ హామీల అమలును కోరుతూ బీజేపీ దివ్యాంగుల విభాగం ఈ వారంలో జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపడుతుందని చెప్పారు. దివ్యాంగులను చైతన్యపరిచి సేకరించిన సంతకాలను ప్రభుత్వానికి అందజేస్తామని, అప్పటికీ స్పందన లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
సమావేశంలో కో-కన్వీనర్లు పొన్న రమేష్, ముంత మల్లేష్ యాదవ్, పగిళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావంతో కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలి.

## అక్టోబర్ మాసాంతంలోగా నివేదిక రూపొందించాలి



**-- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6:**
ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖపై మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శులు దాసరి హరిచందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.
ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కరువు పరిస్థితులపై ప్రణాళిక, రెవెన్యూ, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణ మంచి నీటి సరఫరా తదితర శాఖల నుంచి సమగ్ర వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం కరువు ప్రభావిత మండలాలను గుర్తించాలని ఆదేశించారు.
జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల సీజన్‌లో నమోదైన వర్షపాతం సహా 12 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కరువు నివేదికను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన ప్రమాణాలను ప్రామాణికంగా తీసుకుని కరువు ప్రభావిత మండలాలను ప్రకటించే ప్రక్రియను చేపట్టాలని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను అక్టోబర్ మాసాంతంలోగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు.
ఎల్-నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఆ సమావేశానికి అవసరమైన అన్ని వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను కోరారు.

# సిరిసిల్లలో తప్పు కంటికి ఆపరేషన్‌పై నివేదిక కోరిన టీజీహెచ్ఆర్సీ

**లహైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06 :**
సిరిసిల్లకు చెందిన కొమ్ము వెంకమ్మకు ఎడమ కంటికి బదులుగా కుడి కంటికి శస్త్రచికిత్స చేసినట్లు వచ్చిన వార్తా కథనంపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్సీ) సుమోటోగా స్వీకరించింది. ఈ ఆరోపణలు నిజమైతే, వైద్య నిర్లక్ష్యం, రోగి భద్రత శస్త్రచికిత్సకు సంబంధించి పొందిన సమ్మతి వంటి అంశాలపై తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతున్నాయని కమిషన్ పేర్కొంది. ఈ ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎం అండ్ హెచ్ ఓ) నుంచి సమగ్ర నివేదికను కమిషన్ కోరింది. రోగికి సంబంధించిన వైద్య రికార్డులు, సూచించిన మరియు నిర్వహించిన శస్త్రచికిత్స వివరాలు, రోగి/కుటుంబ సభ్యుల నుంచి పొందిన సమ్మతి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, నిర్వహించిన విచారణ వివరాలను నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది.
ఈ కేసును
వచ్చే నెల 6 వ తేదీ వరకు నివేదిక ను సమర్పించాల్సిందిగా టీజీహెచ్ఆర్సీ ఆదేశించింది.

# ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ 19 కబడ్డీ జట్ల ఎంపికలు

**నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్**
హాలియా: 70వ ఎస్‌జీఎఫ్ అండర్ 19 సంవత్సరాల బాల, బాలికల కబడ్డీ జట్ల కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఎంపికలను హాలియాలో నిర్వహించనున్నారు.
నల్లగొండ జిల్లా డీఐఈఓ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన అండర్ 19 బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు అక్టోబర్ 8వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు హాలియాలోని శ్రీ శ్లోకా పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి కె. ఇందిర తెలిపారు.
కబడ్డీపై ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యే సమయంలో ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు, జనన తేదీ ధ్రువీకరణ పత్రం, ప్రధానోపాధ్యాయులు లేదా ప్రిన్సిపాల్ ధ్రువీకరించిన ఎస్‌జీఎఫ్ అర్హత పత్రాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.
ఎంపికల్లో అర్హత కలిగిన క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని నిర్వాహకులు కోరారు.
సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 80967 45465

# ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం

## ఇందిరమ్మ టవర్స్ వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

**-5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా.. 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు**
**- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**
క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్‌నియోజకవర్గంలోనిగాజులరామార ంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద, పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గౌర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు.
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు.
ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. "మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి.. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి" అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.
కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామీణ ఉపాధి పథకంలో 375 పనులకు అనుమతి

**పాత విధానంతో పోలిస్తే 41 శాతం పెరిగిన పనుల సంఖ్య**
**నీటి భద్రతకు 128, గ్రామీణ మౌలిక వసతులకు 111 పనులు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 6:**
వికసిత్ భారత్--గారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం--2025 (VB--G RAM G) కింద చేపట్టేందుకు వీలైన 375 పనులతో కూడిన కొత్త జాబితాను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గత విధానంలోని 266 పనులతో పోలిస్తే ఇది 41 శాతం పెరుగుదల.
ఈ పనులను నీటి భద్రత, ప్రధాన గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధికి సంబంధించిన మౌలిక వసతులు, విపరీత వాతావరణ పరిస్థితులు--విపత్తుల సన్నద్ధత అనే నాలుగు విభాగాలుగా విభజించారు. గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణం, అభివృద్ధి ఫలితాల సాధనతో ఉపాధి కల్పనను అనుసంధానించడం ఈ కొత్త విధానం లక్ష్యమని మంత్రిత్వ శాఖ తెలిపింది.

**నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం**
నీటి భద్రత విభాగంలో అత్యధికంగా 128 పనులకు చోటు కల్పించారు. చెక్‌డ్యామ్‌లు, గల్లీ ప్లగ్‌లు, భూగర్భ అడ్డుకట్టలు, రీచార్జ్ షాఫ్ట్‌లు, ఇంజెక్షన్ బావులు, నదులు, వాగులు, నాలాల పునరుజ్జీవనం, నీరు నిలిచే భూముల పునరుద్ధరణ, పొలాల్లో నీటి పంపిణీ కాలువల మరమ్మతులు ఇందులో ఉన్నాయి.
డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వ్యవస్థలు, పైకప్పులపై వర్షపు నీటి సేకరణ, టంకాలు, మంచుతో నీటిని నిల్వ చేసే ఐస్ స్తూపాలు, కృత్రిమ హిమానీనదాల వంటి పనులనూ జాబితాలో చేర్చారు.

**గ్రామీణ మౌలిక వసతులకు 111 పనులు**
గ్రామీణ ప్రాంతాల్లో పౌర, సామాజిక మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు 111 పనులను గుర్తించారు. సౌర వీధి దీపాలు, వ్యర్థాల నుంచి సంపద సృష్టించే రీసైక్లింగ్ కేంద్రాలు, గ్రే వాటర్ శుద్ధి యూనిట్లు, వ్యర్థాల వేర్పాటు షెడ్లు, గ్రామీణ గ్రంథాలయాలు, పశువైద్య, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, బహుళ ప్రయోజన యువజన కేంద్రాలు ఇందులో ఉన్నాయి.
ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణంతో పాటు జల్ జీవన్ మిషన్ నీటి సరఫరా వ్యవస్థల మరమ్మతులు, నిర్వహణకూ అవకాశం కల్పించారు. గ్రామీణ పార్కులు, నడక దారులు, ఇతర గ్రామస్థాయి సదుపాయాలూ ఈ జాబితాలో ఉన్నాయి.

**జీవనోపాధికి తోడ్పడే 98 పనులు**
రైతులు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని బలోపేతం చేసేందుకు 98 పనులను చేర్చారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ జోడింపు కేంద్రాలు, శుభ్రపరచడం, గ్రేడింగ్, ప్యాకింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, చిన్న పిండి మిల్లులు, మార్కెట్ యార్డులు, డెయిరీ వసతులు, పుట్టగొడుగుల సాగు షెడ్లు, పట్టు పరిశ్రమ షెడ్లు, పాలీహౌస్‌లు, ఆక్వాకల్చర్ నిర్మాణాలు వీటిలో ఉన్నాయి.
స్వయం సహాయక సంఘాలు, వాటి సమాఖ్యల కోసం వర్క్‌షెడ్లు, 'షీ మార్ట్స్', సమాఖ్య భవనాలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. మొత్తం పనుల్లో జీవనోపాధి సంబంధిత పనుల వాటా 26 శాతానికి పెరిగింది. గత విధానంలో ఇది 1.1 శాతంగా ఉంది.

**విపత్తుల సన్నద్ధతకు ప్రత్యేక విభాగం**
విపత్తుల సన్నద్ధత, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కోసం తొలిసారిగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి 38 పనులను చేర్చారు. వరద సహాయక ఆశ్రయాలు, రిటైనింగ్ వాల్స్, కట్టల బలోపేతం, వరద నివారణ పనులు, విపత్తుల అనంతరం గ్రామీణ రహదారులు, సామాజిక ఆస్తుల పునరుద్ధరణ ఇందులో ఉన్నాయి.
అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ లైన్లు, ఇంధనబఫర్ జోన్ల ఏర్పాటుకూ అనుమతించారు. వరదలు, తుపానులు, గాలివానలు, కరువు, కొండచరియల విరిగిపడటం, అడవి మంటలు వంటి పరిస్థితులను తట్టుకునేలా గ్రామీణ సమాజాలు, ఆస్తులను బలోపేతం చేయడం ఈ విభాగం ఉద్దేశం.

**రైతులు, బలహీన వర్గాలు, మహిళలు, యువతకు ప్రాధాన్యం**
వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన పనులు 181 ఉన్నాయి. నీరు, భూమి, తోటల పెంపకం, పశుసంపద తదితర రంగాల్లో రైతులకు నేరుగా ఉపయోగపడే వ్యక్తిగత లబ్ధిదారుల పనులు 52 ఉన్నాయి.
అంత్యోదయ, బలహీన వర్గాల కుటుంబాల కోసం 107 పనులను గుర్తించారు. వీటిలో 68 వ్యక్తిగత లబ్ధిదారుల పనులు. గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం, ఇంధనం, సాగునీరు, మొక్కల పెంపకం, పశువుల షెడ్లు, ఇతర గృహస్థాయి ఆస్తులు ఈ పనుల్లో భాగంగా ఉంటాయి.
మహిళా శక్తికి సంబంధించిన 36 పనులు, యువశక్తికి సంబంధించిన మరో 36 పనులను చేర్చారు. మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, వాటి సమాఖ్యలకు అవసరమైన వసతులతో పాటు యువజన కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపారాలకు తోడ్పడే మౌలిక వసతులు ఇందులో ఉన్నాయి.

**అందరికీ అందుబాటులో ఉండే మౌలిక వసతులు**
ప్రభుత్వ భవనాల్లో మెట్లు, ర్యాంపుల నిర్మాణం ద్వారా దివ్యాంగులకు సౌలభ్యం కల్పించే పనులను కొత్త షెడ్యూల్‌లో చేర్చారు. సరిహద్దు ప్రాంతాల్లో అత్యవసర తరలింపు, సహాయక శిబిరాలు; పునరుత్పాదక ఇంధన మౌలిక వసతులు; వ్యర్థాల రీసైక్లింగ్, గ్రే వాటర్ శుద్ధి వంటి పనులకూ చోటు కల్పించారు.

**గ్రామసభ ఆమోదంతో పనుల ఎంపిక**
స్థానిక అవసరాల ఆధారంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల ద్వారా పనులను రూపొందిస్తారు. గ్రామసభ ఆమోదం పొందిన తర్వాత వాటిని అమలు చేస్తారు. వికసిత్ భారత్ నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్ ద్వారా పనులను డిజిటల్‌గా పర్యవేక్షిస్తారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక పథకాల పెట్టుబడుల సమన్వయానికి, ఒకే పనిని మళ్లీ చేపట్టకుండా చూడటానికి ఈ విధానం తోడ్పడుతుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉపాధి కల్పనను నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధి, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, సమ్మిళిత అభివృద్ధితో అనుసంధానిస్తూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యానికి దోహదపడటమే కొత్త షెడ్యూల్ ఉద్దేశం.

# నౌకాదళానికి బ్రహ్మోస్ ఫైర్ కంట్రోల్ వ్యవస్థలు, లాంచర్లు

**రూ.661.50 కోట్లతో రక్షణ శాఖ ఒప్పందం**
**కనీసం 68 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ**



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 6:**
భారత నౌకాదళ నౌకల కోసం బ్రహ్మోస్ ఫైర్ కంట్రోల్ వ్యవస్థలు, లాంచర్ల కొనుగోలుకు రక్షణ శాఖ అక్టోబరు 6న బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(బీఏపీఎల్)తోఒప్పందం కుదుర్చుకుంది. 'బై (ఇండియన్--ఐడీడీఎం)' కేటగిరీ కింద కుదిరిన ఈ ఒప్పందం విలువ రూ.661.50 కోట్లు. రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో న్యూఢిల్లీలో ఒప్పందంపై సంతకాలు చేశారు.
ఈ ప్రాజెక్టులో కనీసం 68 శాతం స్వదేశీ ఉత్పత్తులు, పరిజ్ఞానం ఉండనున్నాయి. సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) సహా పలు భారతీయ పరిశ్రమలకు ఇందులో భాగస్వామ్యంకల్పించనున్నారు. మూడేళ్ల కాలంలో ఈప్రాజెక్టుఉపాధి అవకాశాలను సృష్టించనుందని రక్షణ శాఖ తెలిపింది. దేశ సముద్ర భద్రతా వ్యవస్థను, రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, అధునాతన సైనిక సాంకేతికతను స్వదేశీకరించే ప్రయత్నాల్లో ఈ ఒప్పందం కీలక ముందడుగుగా నిలవనుంది. బ్రహ్మోస్ వ్యవస్థను ఇప్పటికే నౌకాదళంలోని పలు ముందంజ యుద్ధనౌకలపై అమర్చారు. సముద్ర దాడి కార్యకలాపాల్లో భారత నౌకాదళానికి ఇది ప్రధాన ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థగా పనిచేస్తోంది. సూపర్‌సోనిక్ వేగంతో, అధిక కచ్చితత్వంతో సుదూరంలోని భూ, సముద్ర లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం దీనికి ఉంది.

## ఆర్థిక సమ్మిళిత పథకాల పురోగతిపై సమీక్ష

### డిజిటల్ సేవల విస్తరణ, రుణాల పూర్తి స్థాయి డిజిటల్ ప్రాసెసింగ్‌పై దృష్టి పెట్టాలి: సంజయ్ లోహియా



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6, ట్రినెట్ న్యూస్:**
ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్‌ఎస్), ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ లోహియా న్యూఢిల్లీలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) అధిపతులు, ప్రధాన ప్రైవేటు రంగ బ్యాంకుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, డీఎఫ్‌ఎస్ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.
ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై), ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై), స్టాండప్ ఇండియా, పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ, పీఎం సూర్య ఘర్, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) తదితర ఆర్థిక సమ్మిళిత పథకాల పురోగతిని సమీక్షించారు. బ్యాంకు శాఖల ఏర్పాటు, బ్యాంకింగ్ సేవలు లేని గ్రామాల్లో బ్యాంకింగ్ కరస్పాండెంట్ల (బీసీ) నియామకంపైనా చర్చించారు.
దేశంలో ఆర్థిక సమ్మిళితాన్ని విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, బ్యాంకులు డిజిటల్ సేవలను మరింత విస్తరించాలని లోహియా సూచించారు. రుణాల మంజూరు ప్రక్రియను ప్రారంభం నుంచి చివరి దశ వరకు డిజిటల్ విధానంలో నిర్వహించాలన్నారు. యూపీఐ క్రెడిట్ లైన్లు, సూక్ష్మ సంస్థలకు క్రెడిట్ కార్డుల (సీసీఎంఈ) వంటి మార్గాల ద్వారా వర్కింగ్ క్యాపిటల్ రుణాలు అందించే అంశాన్ని వివరించారు. ఆర్థిక సమ్మిళిత పథకాల అమలులో ప్రైవేటు రంగ బ్యాంకులు మరింతగా భాగస్వాములు కావాలని కోరారు.
జన్ సురక్ష బీమా పథకాల కింద క్లెయిమ్‌కు అర్హతపై ప్రజల్లో అవగాహన పెంచాలని, లబ్ధిదారుడు దురదృష్టవశాత్తు మరణించినప్పుడు నామినీలకు బీమా మొత్తం అందేలా చూడాలని బ్యాంకులకు సూచించారు. క్లెయిమ్‌లకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవైలో కొత్త లబ్ధిదారులందరినీ జన్ సురక్ష పోర్టల్ ద్వారా నమోదు చేయాలని చెప్పారు. ఈ పోర్టల్‌ను అన్ని బ్యాంకులు, బీమా సంస్థలతో అనుసంధానించడం వల్ల సమాచారం నాణ్యత, సేవల నిర్వహణ మెరుగుపడతాయని తెలిపారు. అటల్ పెన్షన్ యోజనలో సభ్యత్వ కొనసాగింపు నిష్పత్తిని పెంచే మార్గాలపైనా సమావేశంలో చర్చించారు.
2026 అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించనున్న ఆర్థిక సమ్మిళిత ప్రత్యేక ప్రచారంలో బ్యాంకులు పూర్తి స్థాయిలో పాల్గొనాలని లోహియా కోరారు. సమాజంలోని అణగారిన వర్గాలకు సేవలందించడం, వారి బ్యాంకింగ్ అవసరాలను తీర్చడంపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు.ఖ

## హాలియాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్**
హాలియా: హాలియాలోని లక్ష్మీ నరసింహ గార్డెన్స్‌లో స్మార్ట్‌రేషన్‌కార్డులపంపిణీకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హాలియా 5వ వార్డు కౌన్సిలర్ చిట్టిపోలు శ్రీదేవి కరుణాసాగర్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనాలుఅందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,



అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు





**నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్**
హాలియా: హాలియా పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ గార్డెన్స్‌లో నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
ప్రభుత్వ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుతున్న ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.



కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల మరియు పట్టణ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలలో బిఆర్ఎస్‌నాయకులు

**హైదరాబాద్, ట్రినెట్ న్యూస్, అక్టోబర్,6.**
మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలలో భాగంగా బోయిగూడలోని ఫ్లోరా హోటల్ వద్ద కేక్ కట్ చేసి అన్నదానం కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకుడు తలసాని సాయికిరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు లంక రాజు, గంధం శ్రీనివాస్, వెంకటరమణ, ఏసూరి మహేష్, వెంకటేశం రాజు, మహేందర్, రజాక్, జావేద్,



బాలరాజ్ యాదవ్, బాబూరావు, శైలేందర్, పాల్గొన్నారు.

## సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలలోనిమ్మ నాగలక్ష్మి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను పంపిణీ

**హైద్రాబాద్, ట్రినెట్ న్యూస్, అక్టోబర్ 6 :**
సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన సందర్భంగా భోలక్ పూర్ లో నిమ్మ నాగలక్ష్మి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. బిఆర్ఎస్ నాయకులు పవన్ కుమార్ గౌడ్, ఏసూరి మహేష్ వెంకటేశం రాజు, నిమ్మ సంతోష్, జీ.రామారావు, మంగమ్మ పాల్గొన్నారు.



## ఈసీని బీజేపీ అనుబంధ సంస్థలా మార్చేశారు!

## అర్హులైన పేదల ఓట్లు తొలగిస్తున్నారు

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి**
**రాష్ట్రవ్యాప్తంగా 'ఓట్ బచావో - దేశ్ బచావో' ఉద్యమం**
**రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు విపక్షాల పోరుబాట**
**-రాష్ట్ర రవాణా, బీ.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్లు**

**హైదరాబాద్, ట్రినెట్ న్యూస్, అక్టోబర్ 6:**
దేశంలో ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలా ఉండాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం.. అధికార బీజేపీకి అనుబంధ సంస్థలా మారిపోయిందని రాష్ట్ర రవాణా , బీ.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోహెడ మండలం నకిరికొమ్ముల గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఒక్క అర్హులైన ఓటరు కూడా



లిస్టు నుంచి గల్లంతు కాకూడదనే ఉద్దేశంతో సవరణలు జరిగేవని, కానీ ప్రస్తుతం కమిషన్ అధికారులు భయంతో, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఉన్న పేదల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక, బీహార్, బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందే గెలుపు కోసం ఇలాంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒక రాజకీయ పార్టీకి అధికార ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**గల్లీ గల్లీలో 'ఓట్ బచావో' పోరు..**
రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేతలు స్పష్టం చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ఓట్లను కాపాడేందుకు కాంగ్రెస్‌తో పాటు ప్రజాస్వామిక పార్టీలన్నీ ఏకమై దేశవ్యాప్తంగా గల్లీ గల్లీలో 'ఓట్ బచావో – దేశ్ బచావో' పేరిట ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును వినకుండా కేవలం 'మన్ కీ బాత్' పేరుతో తమ మాటలే వినాలనే నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పౌర సమాజం, రాజకీయ పార్టీలు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈసీ తీరు మారకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## గిరిజన యువతకు ఉపాధి

**-ఎకో టూరిజం ప్రాజెక్టులతో కొత్త అనుభూతి**
**-నగర వనాల్లో స్వచ్ఛమైన, ఆహ్లాదకర వాతావరణం**
**-అన్ని ప్రాంతాలను కలిపేలా పర్యాటక అభివృద్ధి**
**-నగర వన యోజన పథకంలో భాగంగా రాష్ట్రంలోని 6 నగరవనాలను వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్**



**అమరావతి, ట్రినెట్ న్యూస్, అక్టోబర్ 6:**
రాష్ట్ర ప్రజలను ప్రకృతిలో మమేకం చేసి, వారికి మరిచిపోని మధురానుభూతులను ఇవ్వడంతోపాటు, గిరిజనులకు ఎకో టూరిజం జీవనోపాధులు మెరుగుపర్చడం ప్రభుత్వం ముందున్న లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చెప్పారు. నల్లమల నుంచి మారేడుమిల్లి వరకు, బాపట్ల తీర ప్రాంత అందాల నుంచి కోటప్పకొండ ఆధ్యాత్మిక ప్రయాణం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పర్యాటక కళను తీసుకొచ్చేలా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితమైన 6 నగరవనాలనుఉపముఖ్యమంత్రివర్యులుమంగళవారం వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నగర వన యోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 19 నగరవనాలుంటే, ఇప్పుడు ప్రారంభించిన ఆరు నగరవనాలతో కలిపి 25 నగరవనాలు రాష్ట్రంలో ఏర్పడతాయి. 305 హెక్టార్లలో, రూ.13 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ నగరవనాలు కేవలం మొక్కలు నాటే ప్రాంతాలుగా కాకుండా, ప్రజలను ప్రకృతి ఒడిలోకి తీసుకెళ్లే మార్గంగా ఉంటాయి. నగరవనాల్లో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ లు, పిల్లలు ఆడుకునే ప్రాంతాలు, జిమ్ పరికరాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో, స్వచ్ఛమైన అందాలతో నగరవనాలు ఆరోగ్యం, ఆహ్లాదం, ప్రకృతి అవగాహన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నాం. బాపట్ల, చీరాల తీర ప్రాంత పర్యాటక వనాలుగా ఉంటే, కోటప్పకొండఆధ్యాత్మికసువాసనలతో విరాజిల్లుతుంది. వినుకొండ, దేవరంపాడు, మాచర్లలో ఏర్పాటు చేసే నగరవనాలు ఆకర్షణీయంగా ఉంటాయి. ప్రకృతికి దగ్గరయితే, ఆరోగ్యం దగ్గరవుతుంది. ప్రకృతి అర్థమైతే, పరిరక్షణ బాధ్యత పెరుగుతుంది. ఇది ప్రకృతి నియమం.

సత్సంకల్పంతో ముందడుగు వేస్తున్నాం
రాష్ట్రంలో ఎకో టూరిజం పెరగడం వల్ల గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెలిగోడు జంగిల్ సఫారీతో సరికొత్త అనుభూతులు లభిస్తాయి. మారేడుమిల్లి ట్రెక్కింగ్, ఆరోమా కనోపీ వాక్ ద్వారా తూర్పు కనుమల అటవీ అందాలను, ప్రకృతి పరిమళాలను ప్రజలకు చేరువ చేస్తాం. గిరిజన సంస్కృతినిప్రజలకు తెలియజేసేందుకు ప్రయత్నిస్తాం. దీనివల్ల గిరిజనుల జీవన విధానంలో మంచి మార్పులు వస్తాయని సత్సంకల్పంతో పని చేస్తున్నాం. ప్రకృతిని ప్రేమించాలి.. భావితరాలకు బహుమతిగా ఇవ్వాలనేది మా సంకల్పం. దీనికి కట్టుబడి పనిచేస్తాం.దీనికిప్రజలుతమవంతుగా సహకరించాలి" అన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ రూపొందించిన వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ ద నల్లమల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రీ టాన్స్ లోకేషన్ మాన్యువల్ పుస్తకాలను ఉప ముఖ్యమంత్రివర్యులు ఆవిష్కరించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ దేశంతోనే మొదటిసారి "ఈకోలిప్టస్ పల్ప్ ఉడ్ ప్లాంటేషన్" విభాగంలో అనుసరిస్తున్న సుస్థిర నిర్వహణ పద్ధతులకు గుర్తింపుగా సాధించిన ప్రమాణ్ సర్టిఫికేట్ ను డిప్యూటీ సీఎం గారి చేతుల మీదుగా అటవీశాఖ అధికారులు అందుకున్నారు.
ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదల నాగేంద్రబాబు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, అటవీ, పర్యావరణ శాఖ చీఫ్ సెక్రటరీ శ్రీ కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డాక్టర్ చలపతిరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, సీఈవో ఏపీ గ్రీన్ బీఎన్ఎన్ మూర్తి, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఎకో టూరిజం ఈడీ నందిని సలారియా, అటవీశాఖ ఐటీ సలహాదారుల పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత ఎత్తులో 'ఏహెచ్‌ఏపీ' పారాచూట్ తొలి లైవ్ జంప్

**ఢిల్లీ, ట్రినెట్ న్యూస్: అక్టోబర్ 6:**
రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) అధునాతన హై ఆల్టిట్యూడ్ పారాచూట్ (ఏహెచ్‌ఏపీ)తో తొలిసారిగా ప్రత్యక్ష జంప్ నిర్వహించింది. అత్యంత ఎత్తులో ఉన్న డ్రాప్ జోన్లలో ఒకటైన న్యోమా (ముధ్ డీజెడ్) వద్ద ఈ పరీక్షను చేపట్టింది.
సముద్ర మట్టానికి 16,000 అడుగుల ఎత్తు నుంచి జంప్ చేసిన సైనికులు, 15,500 అడుగుల ఎత్తులో పారాచూట్‌ను తెరిచారు. 13,700 అడుగుల ఎత్తులో ఉన్న న్యోమా డ్రాప్ జోన్‌లో సురక్షితంగా దిగారు. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఏహెచ్‌ఏపీ పారాచూట్ పనితీరు, వ్యూహాత్మక వినియోగ సామర్థ్యాన్ని ఈ పరీక్ష నిరూపించింది.
ఆగ్రాలోని ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడీఆర్‌డీఈ) ఈ పారాచూట్‌ను రూపొందించి అభివృద్ధి చేసింది.



సైనికులను సమూహంగా పారాచూట్ల ద్వారా దింపేందుకు వీలుగా దీన్ని స్టాటిక్ లైన్ వ్యవస్థతో రూపొందించారు. కాన్పూర్‌లోని ఆర్డినెన్స్ పారాచూట్ ఫ్యాక్టరీ (ఓపీఎఫ్) దీనిని తయారు చేయగా, డీజీఏక్యూఏ తనిఖీ చేసి, సీఈఎంఐఎల్‌ఏసీ ఆర్‌సీఎంఏ కాన్పూర్ ధ్రువీకరించింది.
ఏహెచ్‌ఏపీని వివిధ విధానాల్లో మోహరించవచ్చు. 18,000 అడుగుల వరకు విస్తృత కార్యాచరణ పరిధి కలిగిన ఈ పారాచూట్, దిగే వేగాన్ని సురక్షిత స్థాయిలో ఉంచేలా రూపొందించారు. ఎత్తైన ప్రాంతాల్లో స్టాటిక్ లైన్ పారాచూట్ జంప్‌లు అత్యధిక ప్రారంభ షాక్, దిగే వేగం కారణంగా సంక్లిష్టంగా, ప్రమాదకరంగా ఉంటాయి. భారత రక్షణ దళాల వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా ఈ వ్యవస్థను అభివృద్ధి చేశారు.
దేశీయంగా అభివృద్ధి చేసిన ఏహెచ్‌ఏపీ పారాచూట్ తొలి ప్రత్యక్ష జంప్ విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీఓ, రక్షణ దళాలు, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమ వర్గాలను అభినందించారు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇది మరో కీలక ముందడుగు అని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ రూపకల్పన, అభివృద్ధిలో పాల్గొన్న బృంద సభ్యులకు రక్షణ కార్యదర్శి, రక్షణ పరిశోధన, అభివృద్ధి శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేశ్ కుమార్ సింగ్ అభినందనలు తెలిపారు.

## గిరిజనుల రాజ్యాంగ హక్కులు, చట్టపరమైన నిబంధనలపై జాతీయ సదస్సు

**ఢిల్లీ, ట్రినెట్ న్యూస్: అక్టోబర్ 6:**
గిరిజనులరాజ్యాంగహక్కులు,చట్టపరమైననిబంధనలపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ఢిల్లీలోని స్కోప్ కాంప్లెక్స్‌లో ప్రారంభమైంది. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరాం సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సు అక్టోబర్ 6, 7 తేదీల్లో జరగనుంది.
దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గిరిజన సంక్షేమ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు, నిపుణులను ఒక వేదికపైకి తీసుకురావడం సదస్సు లక్ష్యం. గిరిజనులు తమ రాజ్యాంగ హక్కులను పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కార సూచనలు, అవసరమైనమార్పులపైసిఫారసులురూపొందించనన్నారు. ప్రారంభోపన్యాసంలో జువల్ ఓరాం మాట్లాడుతూ, గిరిజనుల రాజ్యాంగ హక్కులు, రక్షణలకు సంబంధించిన అంశాల్లో తమ అనుభవాలు, ఉత్తమ విధానాలను ప్రతినిధులు పంచుకోవాలని కోరారు. క్షేత్రస్థాయి అధికారులు గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆచరణయోగ్యమైన పరిష్కారాలు, మార్గదర్శకాలను రూపొందించగలదని అన్నారు.




కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. మోసపూరిత క్లెయిమ్‌లను అడ్డుకునే రక్షణలను సమర్థంగా అమలు చేస్తూనే, ప్రక్రియలు సరళంగా, పారదర్శకంగా, నిర్ణీత కాలపరిమితిలో, ప్రజలకు అనుకూలంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.
గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి రంజనా చోప్రా మాట్లాడుతూ, రెండు రోజుల చర్చల్లో ఉమ్మడి సవాళ్లు, ఇతర ప్రాంతాల్లో అమలు చేయదగిన ఉత్తమ విధానాలు, రికార్డుల డిజిటలీకరణ, పత్రాల ప్రక్రియ సరళీకరణ, ఆన్‌లైన్ ట్రాకింగ్, సమర్థ ఫిర్యాదుల పరిష్కారం, రాష్ట్రాల మధ్య మెరుగైన ధ్రువీకరణ విధానాలపై సూచనలు వెలువడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
సుమారు 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 75 మందికి పైగా ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. సాంకేతిక సమావేశాలు, బహిరంగ చర్చలు, అనుభవాల పంచుకునే కార్యక్రమాలు ఇందులో నిర్వహించనున్నారు. సదస్సు చర్చలు రాజ్యాంగ రక్షణల అమలును బలోపేతం చేసి, గిరిజనులకు సమర్థమైన, పారదర్శకమైన, సులభంగా అందుబాటులో ఉండే సేవలు, రక్షణ కల్పించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

# అస్త్రం ...శస్త్రం... శాస్త్రం..

ట్రైనెట్ న్యూస్ శశిమోహన కాంతి కిరణం...



మనభారతీయవిజ్ఞానంఅపూర్వమైనది.ఆధ్యాత్మికతకు సంస్కృతికే పరిమితం కాక,ప్రాచీన కాలం నుండి అత్యద్భుతమైన శాస్త్ర సాంకేతిక విజ్ఞానానికి పురిటిగడ్డగా విలసిల్లింది.ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి పునాదులుగా నిలిచిన ఎన్నో ఆవిష్కరణలు కొన్ని వేల ఏళ్ళ క్రితమే భారత దేశంలో రూపుదిద్దుకున్నాయి. ఈ ఘనత ప్రాచీన భారతీయ మహర్షులు శాస్త్రవేత్తలు సాధించిన ప్రగతి. ఈ ప్రగతి ప్రపంచ విజ్ఞాన చరిత్రలోనే భారత దేశ సాంకేతిక విజ్ఞానానికి మకుటాయమానంగా నిలిచింది. మన భారతీయ సనాతన సంస్కృతిలో మహర్షులు మరియు మునులు కేవలం ఆధ్యాత్మిక గురువులే కాదు ,వారు అసాధారణమైన సైనిక మరియు అస్త్ర శాస్త్ర సాంకేతిక నిపుణులు .ఆధునిక విజ్ఞాన శాస్త్రం నేడు ప్రయోగిస్తున్న క్షిపణులు (missiles),అణు బాంబులు (, nuclear weapons)జీవ రసాయన(bio chemical weapons) ఆయుధాల వంటి సాంకేతికతను వేల సంవత్సరాలకు పూర్వమే మన మహర్షులు మంత్ర ,యంత్ర రూపాలలో ఆవిష్కరించారు.

ముందుగా మనం వారి అద్భుత సృష్టిలో భాగమైన అస్త్రాలను, శస్త్రాలను గురించి తెలుసుకుందాం.

“అస్త్రం” అంటే మంత్రాలను ఉపయోగించి దూరం నుండే శత్రువుల పైన ప్రయోగించే శక్తివంతమైన ఆయుధం.

“శస్త్రం అంటే చేతిలో పట్టుకుని నేరుగా యుద్ధంలో రక్షణ కోసం ఉపయోగించే ఆయుధం. “

ఇతిహాస, పురాణాల ప్రకారం అస్త్రాలు కేవలం భౌతిక ఆయుధాలు కావు అవి మంత్రయుతమైన దైవిక శక్తితో పని చేసే

పరమ పవిత్రమైన, అతి బలీయమైన శక్తులు.

వాటిని ప్రయోగించటానికి నిర్దిష్టమైన మంత్రాలను ఉచ్చరించాల్సిన అవసరం ఉంటుంది. విల్లు నుండి వదిలే ఒక సాధారణ బాణానికి ఈ మంత్ర శక్తిని జోడించినప్పుడు అది అస్త్రం గా మారుతుంది. ప్రతి అస్త్రానికి ఒక అధిష్టాన దేవత ఉంటుంది. ఆ దేవత యొక్క సంపూర్ణ శక్తి ఆ అస్త్రంలో దాగి ఉంటుంది.

అస్త్రాన్ని ప్రయోగించడం మాత్రమే కాకుండా దానిని వెనక్కి తీసుకోవడం కూడా తెలిసి ఉండాలి. అంటే ఉపసంహరించడం కూడా తెలిసి ఉండాలి అది తెలియకపోతే తీవ్రమైన నష్టం కలుగుతుంది. ఉదాహరణ మహాభారతంలో అశ్వద్ధామకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడం మాత్రమే తెలుసు. ఉపసంహరించడం తెలియదు. అది తెలిసిన వాడు అర్జునుడు. అశ్వద్ధామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని అర్జునుడే ఉపసంహరిస్తాడు.

ఇప్పుడు మనం కొన్ని ప్రముఖ అస్త్రాల గురించి చెప్పుకుందాం.

**బ్రహ్మాస్త్రం ;**

సృష్టిలోనే అత్యంత విధ్వంసకరమైన ఆయుధాలలో అతి ముఖ్యమైనది.ఈ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించిన చోటు దశాబ్దాల పాటు కరువు కాటకాలతో నిండిపోతుంది.

**పాశుపతాస్త్రం ;**

ఈ పాశుపతాస్త్రం అతిశక్తివంతమైనది. దీని అధిష్టాన దేవత సాక్షాత్తు పరమశివుడే. ఈ అస్త్రాన్ని కంటి చూపుతో ,మనసుతో లేదా మాటతో కూడా ప్రయోగించవచ్చు.ఈవిశ్వంలోదేనినైనా సర్వనాశనం చేయగల శక్తి కలది.

**నారాయణాస్త్రం** ; ఈ అస్త్రం యొక్క అధిష్టాన దేవత శ్రీమన్నారాయణుడు. దీనిని ప్రయోగించినప్పుడు ఆకాశం నుండి లక్షలాది ఆయుధాలు కురుస్తాయి. శత్రువు ఆయుధాలు కింద పడేసి లొంగి పోతేనే ఇది శాంతిస్తుంది.

అంత శక్తివంతమైనది ఈ నారాయణాస్త్రం.

**ఆగ్నేయాస్త్రం ;**

ఈ అస్త్రానికి అధిష్టాన దేవత అగ్నిదేవుడు.

ఇది భయంకరమైన మంటలను సృష్టిస్తుంది శత్రు సైన్యాన్ని బూడిద చేయడానికి దీనిని వాడేవారు.

**వరుణాస్త్రం ;**

వరుణ దేవుడు ఈ అస్త్రానికి అధిష్టాన దేవత.

ఆగ్నేయాస్త్రం వంటి అస్త్రాల మంటలను ఆర్పడానికి ,వరదలను సృష్టించడానికి దీనిని ప్రయోగించేవారు.

**వాయువ్యాస్త్రం ;**

దీనిఅధిష్టాన దేవత వాయుదేవుడు. అతి భయంకరమైన తుఫానులను, సుడిగాలులను సృష్టించి, శత్రువులను చెల్లాచెదురు చేస్తుంది ఈ అస్త్రం.

ఇవి ముఖ్యమైన అస్త్రాలు. ఈ దివ్యాస్త్రాలు అంత సులభంగా పొందలేరు .తీవ్రమైన తపస్సు చేసి దేవతలను ప్రసన్నం చేసుకున్న తర్వాతే, ఈ అస్త్రాలు వారికి చేరుతాయి . గురువుల పట్ల భక్తిశ్రద్ధలు కలిగి ఉండి, వారి అనుగ్రహం తనే

మంత్రోపదేశం ద్వారా ఈ అస్త్రాలను పొందాలి.

మానసిక నిగ్రహం ,ధర్మం తప్పని గుణం ఉన్నవారికి మాత్రమే గురువులు వీటిని రహస్యంగా ఉపదేశించేవారు.

ఈ అస్త్రాల గురించి మనం రామాయణ, మహాభారత కాలంలో వాటి ప్రయోగం జరిగినట్లు విన్నాం.

రాముడు రావణుడి నాభిలో ఉన్న అమృత భాండాన్ని ఛేదించటానికి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

అలాగే రావణుడి కుమారుడైన ఇంద్రజిత్తు రామలక్ష్మణులను మరియు వానర సైన్యాన్ని బంధించడానికి నాగాస్త్రాన్ని, వారు మూర్ఛపోవడానికి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించారు. తరువాత లక్ష్మణుడు ఇంద్రాస్త్రాన్ని ప్రయోగించి ఇంద్రజిత్తును సంహరిస్తాడు.

అలాగే మహాభారతంలో కర్ణుడు నాగస్త్రాన్ని అర్జునుడి మీదకి ప్రయోగిస్తాడు అయితే శ్రీకృష్ణుడు ప్రధాని భూమిలోకి తొక్కడం వల్ల అది అర్జునుడి తలకి తగలకుండా కేవలం కిరీటాన్ని మాత్రమే ఎగుర గొడుతుంది .

అలాగే అర్జునుడు విరాట రాజు కొలువులో ఉన్నప్పుడు,గోగ్రహణ కాలంలో సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించి ,అందరిని మూర్ఛపోగొడతాడు.

తరువాత కురుక్షేత్ర యుద్ధ సమయంలో జయద్రధుని అంటే సైంధవుని తల తెగవేసేటప్పుడు పాశుపతాస్త్రాన్ని వాడతాడు.

ఇక శస్త్రాలు అంటే బాణాలే.

ఈ విధంగా అద్భుతమైన శక్తివంతమైన అస్త్ర ప్రయోగాలుఇతిహాసాలకాలంలోప్రయోగింపబడి నట్లు తెలుస్తున్నది.

ఇది ఒక సుదీర్ఘమైన వ్యాసం. ఈ వ్యాసంలో అస్త్రాల, శస్త్రాల గురించి చెప్పాను. ఇక ఆధునిక కాలంలో ఆ అస్త్రాలకి ఉన్న పేర్ల గురించి రెండవ పార్ట్ లో వివరిస్తాను. లిలి

ఈనాడు పాశ్చాత్య నాగరికత మోజులో పడి, మన భారతదేశం విలువ తెలియకుండా ప్రవర్తిస్తున్న వారికి ,మన దేశం ఎంత గొప్పదో చెప్పడానికే నా ప్రయత్నం .అందుకే నా ఈ కథనం

**శుభోదయం.. శశిబాల**

# 2023కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను రద్దు చేయాలి:నాగేశ్వరరావు..





ఉస్మానియా యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6 :

2023లో చేపట్టిన కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి, కొత్త జూనియర్ లెక్చరర్ (జేఎల్) నోటిఫికేషన్ విడుదల చేయాలని ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేశాయి. క్రమబద్ధీకరణలో అక్రమాలు, అవినీతిపై సీబీఐతో పాటు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, నిరుద్యోగ నేతలు మాట్లాడుతూ.. ఫేక్ సర్టిఫికెట్ల ఆధారంగా క్రమబద్ధీకరించబడిన 35 మంది జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ బోర్డు సర్వీస్ నుంచి తొలగించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే కేవలం 35 మందితో చర్యలను పరిమితం చేయకుండా, తప్పుడు ధ్రువపత్రాలతో ప్రయోజనం పొందిన వారందరిపై నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గెజిటెడ్ స్థాయి పోస్టులను ఎలాంటి పోటీ పరీక్ష నిర్వహించకుండానే క్రమబద్ధీకరించడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. క్రమబద్ధీకరణ ప్రక్రియలో ఫేక్ డాక్యుమెంట్లు, సర్టిఫికెట్ల ద్వారా పలువురు లబ్ధి పొందినట్లు 35 మంది లెక్చరర్ల తొలగింపు వ్యవహారం స్పష్టం చేస్తోందని నేతలు పేర్కొన్నారు. ఫేక్ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణకు కారణమైన ఇంటర్మీడియట్ బోర్డు, విద్యాశాఖ అధికారుల పాత్రపైనా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఈ అంశంపై తక్షణమే స్పందించి మొత్తం క్రమబద్ధీకరణ ప్రక్రియపై సమగ్ర విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న పేద, గ్రామీణ, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విషయంలో ప్రభుత్వం రాజీపడకూడదని వారు అన్నారు. అర్హత లేని వారిని క్రమబద్ధీకరించడం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో విద్యార్థి, నిరుద్యోగ ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ విద్యార్థి, నిరుద్యోగ సంఘాల నేతలు డాక్టర్ ఎస్. నాగేశ్వర రావు, ఓయు శంకర్, ఉదయ్, అజయ్, మహేష్, వేదాంత మౌర్య, కిరణ్, రంజిత్, మనోజ్, విష్ణు, రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఎస్ఎంఈ వృద్ధి నిధికి రూ.10 వేల కోట్ల కేంద్ర ప్రభుత్వ కేటాయింపు

## చిన్న, మధ్య తరహా సంస్థల్లో ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులు

ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

దేశంలోని చిన్న, మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) వృద్ధికి ఊతమిచ్చి, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగల భారతీయ సంస్థలను తీర్చిదిద్దేందుకు రూ.10 వేల కోట్ల నిధి ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశం, ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ (ఎస్‌జీఎఫ్) కింద ఏర్పాటు చేసే ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధి (ఏఐఎఫ్)కు ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చేందుకు అంగీకరించింది.

2026--27 కేంద్ర బడ్జెట్‌లోని 28వ పేరాలో ప్రకటించిన ఈ పథకం ద్వారా తయారీ, సేవలు, సాంకేతికత, ఆవిష్కరణ ఆధారిత రంగాలు, వ్యూహాత్మక విలువ గొలుసుల్లోని వృద్ధి సామర్థ్యం ఉన్న ఎస్ఎంఈలకు ఈక్విటీ పెట్టుబడులు అందించనున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) వ్యవస్థకు ఈక్విటీ, నగదు లభ్యత, వృత్తిపరమైన మద్దతు అందించాలనే బడ్జెట్ ప్రకటనల్లో ఇది భాగం.

ప్రస్తుతం ఈక్విటీ మద్దతు అందించే నిధుల్లో అధిక శాతం ప్రారంభ దశ సంస్థలు, ముఖ్యంగా సూక్ష్మ సంస్థలపైనే దృష్టి సారిస్తున్నాయి. చిన్న, మధ్య తరహా సంస్థలు విస్తరణకు అవసరమైన ఈక్విటీ పెట్టుబడులు పొందడంలో అంతరం ఉంది. వ్యాపార సామర్థ్యం, విస్తరణకు అవకాశం నిరూపించుకున్న సంస్థలకు దీర్ఘకాలిక వృద్ధి మూలధనాన్ని అందించి, ఈ లోటును పూడ్చడమే ఎస్‌జీఎఫ్ లక్ష్యం.

ఎస్ఎంఈలు ఉపాధి కల్పన, ఎగుమతులు, తయారీ ఉత్పత్తి, ఆవిష్కరణల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రుణ సదుపాయాలు మెరుగుపడినప్పటికీ, కార్యకలాపాల విస్తరణ, సాంకేతికతలో పెట్టుబడులు, విదేశీ మార్కెట్లలో ప్రవేశం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం స్వీకరణ, కొనుగోళ్లు, పరిశ్రమలో అగ్రగాములుగా ఎదగడం వంటి లక్ష్యాలకు అవసరమైన దీర్ఘకాలిక పెట్టుబడుల కొరత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అధిక వృద్ధి సామర్థ్యం ఉన్న సంస్థలకు దీర్ఘకాలిక ఈక్విటీ మూలధనం అందించనున్నారు.

ఎస్‌జీఎఫ్ నిధుల్లో అధిక భాగాన్ని చిన్న, మధ్య తరహా తయారీ సంస్థలకు కేటాయించనున్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని పారిశ్రామిక క్లస్టర్లలో పనిచేస్తున్న ఎస్ఎంఈలకూ పెట్టుబడుల అవకాశాలను పరిశీలిస్తారు. దీంతో తయారీ సామర్థ్యాల విస్తరణ, ఆధునిక సాంకేతికత వినియోగం, ఉత్పాదకత పెంపు, ఎగుమతుల పోటీతత్వం బలోపేతం కావచ్చని కేంద్రం భావిస్తోంది.

ఈ నిధి ద్వారా సంస్థలు కార్యకలాపాలను విస్తరించడంతో పాటు, ప్రపంచ విలువ గొలుసుల్లో భాగస్వాములు కావడం, వ్యూహాత్మక పెట్టుబడులు చేపట్టడం సాధ్యమవుతుందని ప్రభుత్వం తెలిపింది. పారిశ్రామిక క్లస్టర్లలో పెట్టుబడులు ప్రాంతీయ పారిశ్రామిక అభివృద్ధికి, స్థానిక సరఫరా గొలుసుల బలోపేతానికి, నాణ్యమైన ఉపాధి అవకాశాల కల్పనకు తోడ్పడతాయని పేర్కొంది.

సంస్కరణలు, డిజిటలీకరణ, రుణ మద్దతు, వ్యాపార నిర్వహణ సౌలభ్యం, ప్రభుత్వ కొనుగోళ్లలో మార్పులు, స్టార్టప్‌ల ప్రోత్సాహం, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాల ద్వారా ఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ నిధి అదనపు మద్దతుగా నిలవనుంది. అధిక వృద్ధి సామర్థ్యం ఉన్న సంస్థల్లో పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా కొత్త భారతీయ పారిశ్రామిక అగ్రగాముల ఆవిర్భావానికి, ఆవిష్కరణల ఆధారిత పారిశ్రామికీకరణకు, నాణ్యమైన ఉపాధి కల్పనకు దోహదం చేయడమే లక్ష్యమని కేంద్రం తెలిపింది. ఈ కార్యక్రమం ‘వికసిత్ భారత్ 2047’ దార్శనికతలో కీలక భాగంగా నిలవనుంది.

# ప్రమాణాలు రూపొందించడమే కాదు.. క్షేత్రస్థాయిలో సురక్షిత రహదారుల నిర్మాణమే లక్ష్యం

**హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్ - 65 రహదారి పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలు ఆందోళనకరం**

**6o2 లేన్ విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి**

**రోడ్డు భద్రత ఆడిట్లు నిరంతర ప్రక్రియగా కొనసాగాలి**

**-కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలిమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**




గుజరాత్ (ఎక్తానగర్), ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:

గుజరాత్ రాష్ట్రం నర్మద జిల్లాలోని ఎక్తానగర్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్--2026 రెండో రోజు కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సురక్షిత రహదారుల రూపకల్పన -- ప్రమాణాల నుంచి అమలు వరకు”లి అనే అంశంపై జరిగిన ప్రత్యేక సెషన్‌కు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కీలకోపన్యాసం చేశారు.మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి “డిజైనింగ్ సేఫ్ హైవేస్ ఫ్రమ్ స్టాండర్డ్స్ టు “సెషన్ లో మాట్లాడుతూ,

రహదారి భద్రతకు సంబంధించి ప్రమాణాలు, మార్గదర్శకాలు రూపొందించడం మాత్రమే సరిపోదని, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, సురక్షితమైన రహదారిని అందించడమే అసలైన లక్ష్యమన్నారు.

ఈ ముఖ్యమైన అంశంపై చర్చకు నాయకత్వం వహించే అవకాశం కల్పించిన కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు, మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్యానల్ సభ్యులుగా ప్రత్యేక కార్యదర్శి వినయ్ కుమార్ రాజావత్, జాయింట్ సెక్రటరీ సీహెచ్. సింగ్, ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సెక్రటరీ జనరల్ రాహుల్ గుప్తా, ఐఐటీ కాన్పూర్ డీన్, ప్రొఫెసర్ నితిన్ సక్సేనా, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ వెంకటేశ్ బాలసుబ్రమణియన్, ఎన్‌హెచ్ఐడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) అమరేంద్ర కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు ఎన్హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్ యాదవ్,మోర్త్ సెక్రటరీ ఉమాశంకర్ కూడా ప్యానెల్ డిస్కషన్ లో మంత్రి లేవనెత్తిన హైదరాబాద్– విజయవాడ

ఎన్హెచ్ -65 అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం రహదారి భద్రత రంగంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, అనుభవాలు, వినూత్న విధానాలను ఇతర రాష్ట్రాలతో పంచుకునే అవకాశం ఈ చింతన్ శివిర్ ద్వారా లభించిందని అన్నారు.

**అంతర్జాతీయ అనుభవాల నుంచి నేర్చుకోవాలి**

ఇటీవల తాను పలు దేశాల్లో పర్యటించి రహదారి భద్రతకు సంబంధించిన అనేక ఉత్తమ విధానాలను పరిశీలించానని మంత్రి తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు రోడ్డు భద్రతను కేవలం ఇంజినీరింగ్ అంశంగా కాకుండా ప్రత్యేక వృత్తిపరమైన విభాగంగా పరిగణిస్తున్నాయని చెప్పారు.

స్వీడన్ అమలు చేస్తున్న ‘విజన్ జీరో’ విధానం నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. రహదారిపై ఒక్క మరణం లేదా తీవ్ర గాయం కూడా ఆమోదయోగ్యం కాదన్న ఆలోచనను భారత పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్ట్రేలియా అనుసరిస్తున్న ‘సేఫ్ సిస్టమ్’ విధానం మానవ తప్పిదాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, వాహనాలు, వేగ పరిమితులను రూపొందిస్తోందని చెప్పారు. అమెరికా ఫెడరల్ హైవే అడ్మినిస్ట్రేషన్ అనుసరిస్తున్న రోడ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్‌లు, సాంకేతిక మార్గదర్శకాలను కూడా భారత రహదారుల పరిస్థితులకు అనుగుణంగా స్వీకరించవచ్చన్నారు.

రోడ్డు భద్రతకు ప్రత్యేక నిపుణుల వ్యవస్థ అవసరం

ప్రాజెక్టుల అమలులో ప్రస్తుతం ఉన్న ఇంజినీరింగ్ వ్యవస్థలకు తోడుగా స్వతంత్ర రోడ్డు భద్రత నిపుణుల వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. రోడ్డు భద్రత ఆడిట్లు ఒకసారి నిర్వహించి పూర్తి చేసే ప్రక్రియగా కాకుండా.. డిజైన్ దశలో, నిర్మాణ సమయంలో, రహదారి ప్రారంభానికి ముందు, ప్రారంభించిన తర్వాత కూడా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అన్నారు. అంతర్జాతీయ నమూనాలను పరిశీలించి, కీలక రహదారులు ప్రారంభించే ముందు భద్రతా ప్రమాణాలు పూర్తిగా అమలయ్యాయా లేదా పరిశీలించే విధంగా స్వతంత్ర రోడ్డు భద్రత అంబుడ్స్‌మన్’ (రోడ్డు రోడ్డు =ఖ్రు సేఫ్టీ ఒంబుడ్స్మన్ ) లేదా భద్రతా ప్రాధికార సంస్థ (సేఫ్టీ అథారిటీ )లి ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించవచ్చని సూచించారు.

**భూసేకరణ.. రహదారి భద్రతలో కీలక అంశం**

రహదారుల నిర్మాణంలో భూసేకరణ, రైట్ ఆఫ్ వే (రైట్ ఆఫ్ వే ) అందుబాటులో ఉండటం అత్యంత కీలకమని మంత్రి చెప్పారు. సరైన జంక్షన్లు, తగినంత విజిబిలిటీ, సర్వీస్ రోడ్లు, పాదచారుల సౌకర్యాలు కల్పించాలంటే అవసరమైన మేరకు భూమి అందుబాటులో ఉండాలని అన్నారు. అనియంత్రిత మీడియన్ ఓపెనింగ్స్, నేరుగా ఇళ్లకు లేదా వాణిజ్య సంస్థలకు ఇచ్చే యాక్సెస్‌లు, సరిగా డిజైన్ చేయని కూడళ్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని తెలిపారు.

పట్టణాలు, గ్రామాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల మీదుగా వెళ్లే హైవేలపై పాదచారుల క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌లు, బస్ బేలు, లైటింగ్, సైన్ బోర్డులు, ట్రాఫిక్ కాల్మింగ్ చర్యలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు.

బ్లాక్ స్పాట్ గుర్తించడం కాదు.. శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించడం మాత్రమే పరిష్కారం కాదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. అక్కడ శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలపై నిర్ణయాలు మరింతగా డేటా ఆధారంగా ఉండాలని, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదం సంభవించే అవకాశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**నిర్మాణ నాణ్యత కూడా రోడ్డు భద్రతలో భాగమే**

డిజైన్ ఎంత సురక్షితంగా ఉన్నా నిర్మాణ నాణ్యత లోపిస్తే దాని ప్రయోజనం ఉండదని మంత్రి అన్నారు. కాబట్టి క్వాలిటీ అష్యూరెన్స్, సూపర్‌విజన్, రోడ్ మార్కింగ్స్, సైన్ బోర్డులు, క్రాష్ బ్యారియర్లు, డ్రైనేజీ, పేవ్‌మెంట్ నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు.

నిర్మాణం, నిర్వహణ సమయంలో వర్క్‌జోన్ భద్రతకు కూడా మరింత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సరైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌లు, బ్యారికేడింగ్, లైటింగ్, హెచ్చరిక బోర్డులు, సురక్షిత డైవర్షన్‌లు ఏర్పాటు చేయడం ద్వారా కార్మికులు, వాహనదారుల భద్రతను కాపాడాల్సి ఉందన్నారు.

**టెక్నాలజీతో ప్రమాదాలను ముందుగానే గుర్తించాలి**

ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్, సీసీటీవీ నిఘా, ఇన్సిడెంట్ డిటెక్షన్, స్పీడ్ మానిటరింగ్, జీఐఎస్ ఆధారిత సేఫ్టీ మ్యాపింగ్, డ్రోన్లు, డిజిటల్ రోడ్ ఇన్వెంటరీ వంటి సాంకేతికతలను విస్తృతంగా ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు.

డిజైన్‌లో సేఫ్.. నిర్మాణంలో సేఫ్.. ఆపరేషన్‌లో సేఫ్.. రహదారి మొత్తం జీవితకాలంలో సేఫ్ అనే విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు.

2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించాలి

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నిర్దేశించిన విధంగా 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించే జాతీయ లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని రాష్ట్రాలు కలిసి పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు కూడా సుమోటోగా కేసు స్వీకరించి, రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా రోడ్డు సేఫ్టీ సమావేశాలు నిర్వహించి ప్రమాదాలను విశ్లేషించాలని, బ్లాక్ స్పాట్లను గుర్తించి జిల్లా స్థాయిలో తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

**దేశంలో రోడ్డు ప్రమాద మరణాలు ఆందోళనకరం**

2023లో దేశవ్యాప్తంగా 1,72,890 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని మంత్రి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 23,652 మంది, తమిళనాడులో 18,347 మంది, మహారాష్ట్రలో 15,366 మంది, మధ్యప్రదేశ్‌లో 13,798 మంది, కర్ణాటకలో 12,321 మంది మరణించారని చెప్పారు. తెలంగాణలో 2023లో 7,660 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, ఇది దేశవ్యాప్తంగా నమోదైన మరణాల్లో 4.4 శాతంగా ఉందన్నారు. దేశంలోని మొదటి పది రాష్ట్రాల్లోనే దాదాపు 74 శాతం రోడ్డు ప్రమాద మరణాలు నమోదవుతున్నాయని తెలిపారు హైదరాబాద్ - విజయవాడ ఎన్హెచ్- 65 రహదారి పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై ఈ సమావేశంలో మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 17బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మాణం జరుగుతున్నా... ప్రస్తుతం ఉన్న 4 లేన్ రహదారిపై ట్రాఫిక్ లోడ్ విపరీతంగా పెరిగిందన్నారు. 6o2 లేన్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రహదారి విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉన్నదని మంత్రి పేర్కొన్నారు. ఈ రహదారి విస్తరణ అంశం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వద్ద ప్రత్యేకంగా ప్రస్తావించామని,త్వరలో కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి, పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చే అంశమని అభివర్ణించారు.

అంతర్జాతీయంగా చూస్తే భారత్‌లో రోడ్డు ప్రమాద మరణాల రేటు కూడా ఆందోళనకరంగా ఉందన్నారు. అమెరికా, యూకే, జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాలు రహదారి డిజైన్, వాహన భద్రత, వేగ నియంత్రణ, కఠినమైన అమలు, పాదచారులు-- సైక్లిస్టుల భద్రత, ప్రమాద డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా మరణాలను గణనీయంగా తగ్గించ గలిగాయని తెలిపారు.

**ఐదు అంశాలపై సమిష్టిగా దృష్టి పెట్టాలి**

చింతన్ శివిర్‌లో రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు.

1. భద్రతను దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేయాలి
2. నిర్మాణంలోనూ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి
3. నిర్వహణలో భద్రతను నిర్ధారించాలి
4. డేటా, సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలి
5. నిరంతరం సమీక్షిస్తూ మెరుగుపరుచుకోవాలి

ఎన్ని కిలోమీటర్లు నిర్మించామన్నది కాదు.. ఎన్ని ప్రాణాలు కాపాడామన్నదే ముఖ్యం

హైవే ప్రాజెక్టు విజయాన్ని కేవలం ఎన్ని కిలోమీటర్ల రహదారి నిర్మించాం, ఎంత ప్రయాణ సమయం తగ్గించాం, ఎంత ట్రాఫిక్ సామర్థ్యం పెంచాం అనే అంశాలతో మాత్రమే కొలవకూడదని మంత్రి అన్నారు. “అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఒక్కటే.. మనం ఎన్ని ప్రాణాలను కాపాడగలిగాం?” అని అన్నారు. ప్రతి వాహనదారుడు, ప్రయాణికుడు, పాదచారి, సైక్లిస్ట్, ద్విచక్ర వాహనదారుడు, హైవేల వెంట నివసించే స్థానిక ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా రహదారులను నిర్మించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

వేగవంతమైన, సమర్థవంతమైన ప్రయాణంతో పాటు ప్రతి ప్రయాణం సురక్షితంగా ఉండే భవిష్యత్తును నిర్మించేందుకు కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

నేడు మనం నిర్మించే ప్రతి కిలోమీటర్ రహదారి.. రాబోయే తరాలకు కూడా సురక్షితంగా ఉండాలి. ప్రమాణాల నుంచి అమలుకు.. అమలు నుంచి మెరుగైన పనితీరుకు మన ప్రయాణం కొనసాగాలి” అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ ఐఏఎస్ , చీఫ్ ఇంజినీర్ (నేషనల్ హైవేస్) ధర్మారెడ్డి, చీఫ్ ఇంజినీర్ (ఆర్ ఆర్ ఆర్ అండ్ సీఆర్ఐ ఎఫ్ ) వసంత్ నాయక్, చీఫ్ ఇంజినీర్ (స్టేట్ రోడ్స్ అండ్ హామ్ ) బి. వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కలిసి మమ్ములను ఎంపిక చేసినందుకు పూలగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన.. --ఇటిక్యాల్ ప్యాక్స్ చైర్మన్ మరి పెల్లి శ్రీనివాస్ గౌడ్ పాలక వర్గం





ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ లునూతన కార్యవర్గ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య ని జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి మమ్ములను ఎంపిక చేసినందుకు శుభాకాంక్షలు తెలిపారు ఎన్నికైన పాలకవర్గానికి సత్కరించి పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అనేక పద్ధతి ఉన్నాయని ఆ పద్ధతి చెరపడానికే సహకార సంఘాలు ఏర్పడ్డాయని అలాంటి సహకార సంఘం రైతులకు అనేక సూచనలు ఇవ్వాలని వారి బాగోగులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని రైతుల సేవనే మాధవసేవ అదే విధంగా పనులు చేయాలని ప్రతి సభ్యులు సంఘ సభ్యులు బాధ్యతయుతంగా పనిచేయాలని ఇది ఒక బాధ్యతగా గుర్తించాలని ఆయన కోరారు

## స్వాతంత్ర్య సమరయోధుడు అమరజీవి వడ్డె ఓబన్న వర్ధంతి వేడుకలు

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:




దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక యోధుడు అమరజీవి వడ్డె ఓబన్న వర్ధంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను వడ్డెర హక్కుల ఉద్యమ నేత, జాతీయ వడ్డెర సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షులు బట్టుల లక్ష్మీకాంత్ రాజు వెల్లడించారు. కర్నూలు నగరంలోని బీసీ భవన్ వద్ద ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ వేడుకల్లో భాగంగా అమరజీవి వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన త్యాగాలను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించడం జరుగుతుంది. చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించనున్న ఈ వర్ధంతి వేడుకలకు బీసీ కులస్తులు, వడ్డెర సోదరులు మరియు వివిధ ప్రజాసంఘాల నాయకులు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరడమైనది.
సదా మీ సేవకుడు:బట్టుల లక్ష్మీకాంత్ రాజువడ్డెర హక్కుల ఉద్యమ నేత,
జాతీయ వడ్డెర సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షులు

## బీసీల రిజర్వేషన్లపై దొంగ నాటకాలు వద్దు




ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

సమాజంలో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న సమస్త వెనుకబడిన తరగతుల (బీసీ) అన్ని కులాల హక్కుల పరిరక్షణ మరియు రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో కొనసాగుతున్న నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా దశాబ్దాలుగా సామాజికంగా, ఆర్థికంగామరియురాజకీయంగాఅత్యంత వెనుకబడి ఉన్న వడ్డెర కులస్థులు ఈ ఉద్యమాలలో ముందువరుసలో ఉంటూ తమహక్కులకోసం గళం వినిపిస్తున్నారు. రాజ్యాంగ ఫలాలు అందక అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్న వడ్డెర్లకు మరియు సమస్త బీసీ కులాలన్నింటికీ తగిన న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అయినా లేదా ప్రతిపక్ష వైయస్సార్సీపీ (వైసీపీ) అయినా, ఏ పార్టీ అధికారంలో ఉన్నా బీసీ కులాల అభివృద్ధి కేవలం హామీలకే పరిమితం కాకూడదని స్పష్టం చేస్తున్నారు.
రాజకీయ ప్రాతినిధ్యం మరియు వడ్డెర్ల వెనుకబాటుతనం:రాజ్యాంగంలో అత్యంత వెనుకబడి ఉన్న వడ్డెర తదితర బీసీ కులాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో రాజకీయ పార్టీలు విఫలమవుతున్నాయి. రాజకీయ పార్టీలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, కేవలం రిజర్వ్‌డ్ స్థానాలకే పరిమితం కాకుండా చట్టసభల్లోని 'జనరల్' స్థానాలలో కూడా వడ్డెర్లకు మరియు ఇతర బీసీ కులాలన్నింటికీ సముచితమైన అవకాశాలు ఎందుకు కల్పించడం లేదంటూ సూటిగా ప్రశ్నిస్తున్నారు.
కాలయాపన వద్దు: రిజర్వేషన్ల పేరుతో కాలయాపన చేయడం మానుకుని, వడ్డెరలతో సహా బీసీ కులాలందరికీ తగిన రాజకీయ భాగస్వామ్యాన్ని వెంటనే కల్పించాలని కోరుతున్నారు.
మాటలు కాదు – ఆచరణ: బీసీల హక్కుల సాధనలో ఇకపై రాజకీయ నాయకుల మాయమాటలు నమ్మే ప్రసక్తే లేదని, కేవలం ఎన్నికల వేళ జెండాలు మోసేందుకేనా లేక వడ్డెర్లకు, బీసీ కులాలన్నింటికీ నాయకత్వం వహించే అవకాశం లేదా అని నిలదీస్తున్నారు. మాటల్లో కాకుండా చేతల్లో ఆచరించి చూపాలని డిమాండ్ చేస్తున్నారు.
పులివెందుల కేంద్రంగా వడ్డెరలు మరియు అన్ని బీసీ కులాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసన గళం ద్వారా, రాజకీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకుని వడ్డెర్లకు, బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేయడమైనది.

## పేటలో ఘోర రోడ్డు ప్రమాదం: వ్యక్తి దుర్మరణం

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:



చిలకలూరిపేట పట్టణ పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. చిలకలూరిపేట నుండి చెరువు రోడ్డు వైపు వెళ్లే మార్గంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట నుండి అటుగా వెళ్తున్న ఒక కారు, మలుపు వద్ద ఎదురుగా వస్తున్న పల్సర్ బైక్‌పై వస్తున్న తన్నీరు శ్రీహరి అనే వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. ?ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీహరి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతదేహాన్ని పరిశీలన మరియు పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఇకపై ప్రతి శనివారం బ్యాంకులకు సెలవు

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:


~ Karimulla +91 94406 16772

भारत का राजपत्र
The Gazette of India

దేశంలోని బ్యాంకింగ్ రంగం మరియు ఖాతాదారులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో మరియు పలు వార్తా మాధ్యమాలలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇకపై దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ బ్యాంకులన్నింటికీ కూడా ప్రతి నెలా వచ్చే ప్రతి శనివారాన్ని పబ్లిక్ హాలిడేగా (సెలవు దినంగా) ప్రకటిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సమాచారం ద్వారా తెలుస్తోంది.
భారతీయ స్టేట్ బ్యాంక్ (భారతీయ స్టేట్ బ్యాంక్ - ఎస్.బి.ఐ.) సహా దేశంలోని అన్ని ప్రధాన ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖలకు మరియు ప్రాంతీయ బ్యాంకులకు ఈ కొత్త నిబంధన తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ ప్రచారంలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 30, 2026న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దీనికి సంబంధించి ఒక అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసినట్లు ఆ వైరల్ వార్త సారాంశం.
అయితే, ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం బ్యాంకులు ప్రతినెల కేవలం రెండవ మరియు నాల్గవ శనివారాలలో మాత్రమే సెలవులను కలిగి ఉంటాయి. మొదటి, మూడవ మరియు ఐదవ శనివారాలు పని దినాలుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న ఈ వార్త మరియు గెజిట్ నోటిఫికేషన్‌పై కేంద్ర ప్రభుత్వం లేదా అధికారిక వర్గాల నుంచి పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ఖాతాదారులు మరియు బ్యాంకు ఉద్యోగులు ఈ అంశానికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే వరకు తగు గమనికతో ఉండాలని సూచించడమైనది.

## ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర కరువు పరిస్థితులు -- ప్రభుత్వ తీరుపై ప్రజల ఆగ్రహం



ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:



ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు, ప్రజలు తీవ్ర కరువు ఛాయలతో అల్లాడిపోతున్నారు. ఎటు చూసినా కరువు తాండవిస్తుండటంతో, చేతిలో పనిలేక, ఉపాధి కరువై ప్రజలు "అయ్యో రామచంద్రా" అంటూ దిక్కులు చూస్తున్నారు. ఒక్కో కుటుంబం బతకడమే భారమై రోడ్డున పడుతున్నా ప్రభుత్వానికి మాత్రం పట్టడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఇంటింటికి జలధార ఎక్కడి నుంచి తెస్తారు?: రాష్ట్రంలో వర్షాలు అసలు పడకపోయినా, వర్షాలు కురవాలని ప్రత్యేకంగా వర్ణయాగాలు చేయడం గానీ, లేదా నదుల అంతరదానం (నదుల అనుసంధానం) ద్వారా నీటిని తరలించడం వంటి శాశ్వత ప్రణాళికలు ఏవీ సరిగ్గా అమలు కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అందరూ కలిసి కావేరి తదితర నదులను అనుసంధానం చేసి ఉమ్మడి ఆలోచనతో ముందుకు వస్తేనే తప్ప, కేవలం మాటలతో ఇంటింటికి జలధార ఎక్కడి నుంచి తెస్తారని ప్రజలు నిలదీస్తున్నారు. వర్షాలు పడక దేవుడే దిగివచ్చినా సాధ్యం కాని పరిస్థితుల్లో, కేవలం గాలి మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ఆంధ్రప్రదేశ్‌ను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి: రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితుల దృష్ట్యా, ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని తక్షణమే 'కరువు' రాష్ట్రంగా ప్రకటించాలని ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో బతకలేక మనుషులు ఆకలితో అల్లాడిపోయే దారుణ రోజులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఎన్నికల స్టంట్లు తప్ప ఒరిగిందేమీ లేదు: ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు అవుతున్నా ప్రజలకు ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా శాంక్షన్ చేయలేదని, ప్రజల కష్టాలను పట్టించుకోకుండా కేవలం ఎన్నికల సమయం వచ్చేసరికి జలధారలని, బీసీ రిజర్వేషన్లని కొత్త డ్రామాలు ఆడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ప్రజలు తీవ్ర ఆగ్రహం మరియు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

## గత ప్రభుత్వంలాగే ప్రస్తుత ప్రభుత్వ తీరు -- ప్రజల ఆగ్రహం మరియు ప్రతిపక్ష పాత్రపై విశ్లేషణ

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:




గతంలో వైయస్సార్సీపీ (వైసీపీ) ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం వల్లే ప్రజలు విసిగి పోయి చంద్రబాబు నాయుడి ని గెలిపించారు. కానీ నేడు అదే చంద్రబాబు ప్రభుత్వంకూడాప్రజలకష్టాలనుపట్టించుకోకుండా, కరువుతో అల్లాడిపోతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసే ధోరణిలోనే వ్యవహరిస్తోందని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి కూడా ప్రజల నుంచి తీవ్రమైన తిరస్కార తప్పదు అనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.
ప్రభుత్వ వైఫల్యాలు - పునరావృతమవుతున్న తప్పులు: గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే ప్రజలు మార్పు కోరుకుంటే, నేడు ప్రస్తుత ప్రభుత్వం కూడా కరువు పరిస్థితులను, రైతుల వేదనను, తాగునీటి సమస్యలను గాలికి వదిలేసిందని ప్రజలు మండిపడుతున్నారు. ఇంటింటికి జలధార అంటూ గాలి మాటలు చెప్పడం తప్ప ఆచరణలో శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతిపక్షంపై ప్రజల ఆశలు - గట్టి పోరాటం చేయాలని డిమాండ్: రాష్ట్రంలో నెలకొన్న ఈ దారుణ పరిస్థితులపై ప్రతిపక్ష నేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గట్టిగా కొట్లాడాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలు కోరుతున్నారు. ప్రతిపక్షంగా వైఎస్సార్సీపీ బాధ్యత వహించి, రాష్ట్రంలోని కరువు మండలాలను పూర్తిగా ప్రకటించే వరకు మరియు ప్రజల సమస్యలపై ఉద్యమించేలా పోరాటాలు ఉధృతం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రాష్ట్రంలోని కరువు ప్రాంతాలను ఆదుకోవాలని, లేదంటే ప్రజల ఆగ్రహాన్ని మూటగట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించడమైనది

## బయో-కాన్ఫ్లుయెన్స్--2026' రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:








శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అకడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ -- ఏ-100 రోజుల కార్యక్రమంలో భాగంగా, ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ డిగ్రీ కళాశాల (అటానమస్), కరీంనగర్ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'బయో-కాన్ఫ్లుయెన్స్--2026' పేరుతో రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. "జీవవైవిధ్యం, జాతివృక్షశాస్త్ర వారసత్వం మరియు సుస్థిర ఆహార వ్యవస్థల కోసం జీవసాంకేతిక సాధనాల అన్వేషణ" అనే ప్రధాన అంశంపై ఈ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించబడనుంది. ఈ వర్క్‌షాప్‌కు సంబంధించిన పోస్టర్‌ను శాతవాహన విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ (పెద్దపల్లి), కోఆర్డినేటర్ అకాడమిక్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాం శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీరంగ ప్రసాద్ పాల్గొన్నారు.
అలాగే ఎస్.ఆర్.ఆర్. కళాశాల వృక్షశాస్త్ర విభాగం హెచ్.ఓ.డీ & పరీక్షల నియంత్రణాధికారి వర్క్ షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్, సహాయ ఆచార్యులు , వర్క్ షాప్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ డా. పడాల తిరుపతి, డా. రౌతు రాధాకృష్ణ,డా.సతీష్, డా. అంటె బంగ తిరుపతి పాల్గొన్నారు.
ఈ రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో జీవవైవిధ్య పరిరక్షణ, జాతివృక్షశాస్త్ర వారసత్వం, ఔషధ మరియు ఆహార మొక్కల ప్రాధాన్యత, జీవసాంకేతిక పరిజ్ఞానంలోని ఆధునిక సాధనాలు, సుస్థిర వ్యవసాయం మరియు సుస్థిర ఆహార వ్యవస్థల అభివృద్ధి వంటి అంశాలపై నిపుణుల ద్వారా అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుత కాలంలో జీవవైవిధ్య పరిరక్షణతో పాటు స్థానిక వృక్ష సంపద, సాంప్రదాయ జ్ఞానం మరియు ఆధునిక జీవసాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయం చేసి సుస్థిర ఆహార వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు మరియు విద్యార్థులకు ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించడం, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడం, జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం చేపడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అకడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ -- ఏ-100 రోజుల కార్యక్రమం ద్వారా అధ్యాపకులు, విద్యార్థుల్లో నూతన శాస్త్రీయ ఆలోచనలు, పరిశోధనా నైపుణ్యాలు మరియు సుస్థిర అభివృద్ధిపై అవగాహన పెంపొందించేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## స్మిత్ మచ్చర్ సాహసానికి ప్రశంసలు ...

## "విద్వేషం కాదు, విధ్వంసం కాదు---మానవత్వమే మన పరమ మతం కావాలి"

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:



ఫ్లై దుబాయ్ ఘటనలో 174మంది ప్రయాణీకుల ప్రాణాలను కాపాడిన స్మిత్ మచ్చర్ సాహసాన్ని ప్రశంసిస్తూ రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ అందించిన కవిత.

"సాహసానికి శతకోటి సెల్యూట్ !
గగనతలంలో ముంచుకొచ్చిన విపత్తు వేళ,
కలవరపడని కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యం
వందల ప్రాణాలకు రక్షణ కవచమైంది!"
భయాన్ని జయించిన అతని సమయస్ఫూర్తి,
మరణ ముఖం నుండి మనుషులను గట్టెక్కించిన
అమరదీపమైంది!
మానవ ప్రాణాల విలువ తెలియని మతోన్మాద
విధ్వంసం---
నిలువెత్తు మానవత్వానికే తీరని మచ్చ!
""విద్వేషం కాదు, విధ్వంసం కాదు---
మానవత్వమే మన పరమ మతం కావాలి""!
ప్రాణదాతగా నిలిచిన ఓ వీరుడా...
నీ సాహసానికి ఈ జాతి యావత్తూ సమర్పిస్తోంది
శతకోటి సెల్యూట్ !!

## ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా తోపుడు బండ్ల వ్యాపారస్తులు సహకరించాలి - మున్సిపల్ కమిషనర్

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:




జగ్గయ్యపేట పట్టణంలో రోజు రోజుకి వాహనాల వల్ల ట్రాఫిక్ పెరుగుతుంది.ట్రాఫిక్ అంతరాయాలను దృష్టి లో పెట్టుకొని కోదాడ రోడ్డులో మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ ను కొనసాగించారు.ఈ సందర్భంగా తోపుడు బండ్ల వారికి , ఫుట్ పాత్ పై నేమ్ బోర్డులు ఉంచుతున్న వ్యాపారస్తులకు మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తూ ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా సహకరించాలని అధికారులు కోరడం జరిగింది.దీనితో కొందరు వ్యక్తులు స్వచ్ఛందంగా సహకరిస్తూ ట్రాఫిక్ కి అంతరాయం లేకుండా చూస్తామని చిన్న వ్యాపార వర్గాల వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకట రమణ మరియు ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# ముగిసిన చంద్రబాబు, పవన్ భేటీ.. కీలక నిర్ణయాలు

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య కీలక సమావేశం విజయవంతంగా ముగిసింది. రాజధాని అమరావతి పరిధిలోని ఉండవల్లిలో ఉన్న ముఖ్యమంత్రి అధికారిక నివాస కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని పలు రాజకీయ మరియు పాలనాపరమైన అంశాలపై చర్చించారు.

?రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉండాలనే అంశంపై ఇరువురు నేతలు అత్యంత కీలకంగా చర్చలు జరిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం శాతాన్ని వంద శాతానికి చేర్చడమే ప్రధాన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో ఏ పార్టీకి ఎలాంటి బలాలు ఉన్నాయో బేరీజు వేసుకుని, బలమున్న స్థానాల్లో ఆయా భాగస్వామ్య పార్టీల అభ్యర్థులను పోటీలో నిలిపేందుకు ఇరువురు నాయకులు సానుకూల అంగీకారం తెలిపారు. సీట్ల సర్దుబాటు ప్రక్రియలో కేవలం పైస్థాయి నిర్ణయాలకే పరిమితం కాకుండా, స్థానికంగా ఉన్న పార్టీల బలబలాలకు మరియు వాస్తవిక పరిస్థితులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన నిర్ణయానికి వచ్చారు

# తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్‌కు 'సూర్య' నామకరణం



ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో గల హిందుస్థాన్ షిప్‌యార్డులో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్‌కు 'సూర్య' అని అధికారికంగా నామకరణం చేశారు. సుమారు 46,000 టన్నుల భారీ బరువు మరియు 81 టన్నుల శక్తివంతమైన ప్రొపెల్లర్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ నౌక, దేశంలోనే రెండో అతిపెద్ద ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్‌గా సిద్ధమవుతోంది.

సముద్ర జలాల్లో భారత నౌకాదళం యొక్క రక్షణ శక్తిని, వ్యూహాత్మక సామర్థ్యాలను మరింత పటిష్టం చేసుకునే దిశగా చేపట్టిన ఈ కీలక ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ నౌకకు 'సూర్య' అనే పేరును ఖరారు చేశారు. దీనిద్వారా దేశీయ రక్షణ రంగ తయారీ సామర్థ్యాలు మరింత పెరుగుతాయని నిపుణులు భావిస్తున్నారు.

# బాపట్లలో రూ. 5 కోట్లతో కోత అనంతరం సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ప్రారంభం



ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

బాపట్ల పట్టణంలోని ప్రసిద్ధ ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో సుమారు రూ. 5 కోట్ల భారీ వ్యయంతో అత్యాధునిక హంగులతో నిర్మించిన కోత అనంతరం సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం, వర్క్‌షాప్ మరియు ట్రైనింగ్ సెంటర్ నూతన భవనాలను అధికారికంగా ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, మత్స్య, మరియు పాడి పరిశ్రమభివృద్ధి శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. వీరితో పాటు బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ మరియు బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) వేగేశన నరేంద్ర వర్మ రాజు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన భవనాలను ప్రారంభించారు. వ్యవసాయ రంగంలో విద్యార్థులకు మరియు రైతులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# స్థానిక ఎన్నికలపై సుప్రీంలో పిటిషన్.. ఢిల్లీకి మంత్రులు



ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో రాబోయే శుక్రవారం రోజున విచారణ జరగనుంది. దీనితో పాటు, రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచడంపై దాఖలైన పలు కీలక పిటిషన్లపై కూడా కోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

ఈ న్యాయపరమైన పరిణామాల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ వాదనలను బలోపేతం చేయడానికి మరియు తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ముగ్గురు మంత్రుల ప్రత్యేక బృందం మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీకి పయనం కానుంది. ఈ పర్యటనలో భాగంగా ఆ మంత్రులు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో సమావేశమై చర్చిస్తారు. ఈ బృందంలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, మరియు కొల్లు పార్థసారధి తదితరులు పాల్గొని న్యాయ నిపుణులతో భేటీ కానున్నారు.

# అమిన్ సాహెబ్ పాలెంలో గ్యాస్ లీక్..

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

గ్యాస్ లీక్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి భయానక వాతావరణం నెలకొంది. పోతూరు రాంబాబుకు చెందిన పెన్కుటిల్లు పూర్తిగా దెబ్బతిన్న ఘటన చోటుచేసుకుంది.

ఇంట్లోని ఫ్రిజ్, టీవీతో పాటు ఇతర గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.

ఈ ప్రమాదంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

గ్యాస్ లీక్ అనంతరం భారీ శబ్దం వచ్చి, మంటలు చెలరేగినట్లు స్థానికులు వెల్లడించారు.

మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.




ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నట్లు స్థానికులు తెలిపారు.

ఘటనకు గల పూర్తి కారణాలు, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు అధికారికంగా తెలియాల్సి ఉంది.

# జగిత్యాల జిల్లాలో ఆహార వ్యాపార సంస్థల లైసెన్సులు, నాణ్యత ప్రమాణాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలి- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:




జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాలను పటిష్టంగా అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లో మిని సమావేశం మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ

అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో చిన్నారులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.అదే విధంగా హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, స్ట్రీట్ ఫుడ్, మెస్‌లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనిస్పష్టంచేశారు. కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లలో ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలు, నిల్వ విధానాన్ని పరిశీలించాలని, ప్రజలకు అందించే తాగునీటి శుభ్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని జిల్లాలో ఆహార భద్రతను మరింత పటిష్టం చేసేలా సమగ్ర చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని, చిన్నారులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియ, తాగునీటి నాణ్యత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లు, మెస్‌లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ నాణ్యత లేని ఆహారాన్ని విక్రయించే సంస్థలపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లలో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలు, నిల్వ విధానం, ప్యాకేజింగ్ తదితర అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని ఆహార పదార్థాల విక్రయాలను నిరోధించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు అందించే తాగునీటి శుభ్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. నీటి వనరులు, సరఫరా వ్యవస్థలు, తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో ఆహార భద్రతను మరింత పటిష్టం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. ఆహార భద్రత నిబంధనలపై వ్యాపార సంస్థల నిర్వాహకులకు, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనల అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, డిపివో మదన్ మోహన్,డి డబ్ల్యు ఓ భాస్కర్ సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నరు

# ఉచిత బస్ పాస్ కోసం దివ్యాంగుల చలో హైదరాబాద్ అక్టోబర్ 8న ఆర్టీసీ బస్ భవన్ ఎదుట ధర్నా

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:



దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించడంతో పాటు తమ హక్కులు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 8న హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్ భవన్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) మాగనూరు మండల శాఖ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం మాగనూరు మండల కేంద్రంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ మండల అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ హామీ ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు. దివ్యాంగులకు అన్ని శాఖల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. 2026 క్యాలెండర్ ప్రకారం 21 రకాల వైకల్యాలను అమలు చేసి, అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే పునరుద్ధరణ ధ్రువపత్రాల కోసం ప్రత్యేక సదరం శిబిరాలు ఏర్పాటు చేయాలని, దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను, మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను వెంటనే అమలు చేయాలని కోరారు.దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో అక్టోబర్ 8న హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్ భవన్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు మాగనూరు మండలంలోని దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బాబు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ మండల కార్యదర్శి రవి, వెంకటయ్య, నర్సిములు, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

# కలబంద తాంత్రిక పరిహారం.......!!

## ఈ చెట్టు ని అందరూ వాస్తు పరిహారం అనె పేరుతే పెంచుతున్నారు కానీ...

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:





కలబంద తాంత్రిక పరిహారం.......!!

ఈ చెట్టు ని అందరూ వాస్తు పరిహారం అనె పేరుతే పెంచుతున్నారు కానీ ఇది తాంత్రిక పరిహారంగా కూడా ఉపయోగపడుతుంది అని సామాజికవేత్త ఆధ్యాత్మిక వ్యక్తిగా దైవచింతన గల దైవరాధకుడిగా సనాత ధర్మ పరిరక్షకుడూ ఆడెపు రాజమౌళి తెలిపారు

అది ఎలా అంటే ఈ చెట్టు లో జీలకర్ర నీళ్లు సోమవారం రోజు పోయాలి (ఒక గ్లాసు నీళ్ళలో ఒక స్పూన్ జీలకర్ర వేసి నానబెట్టాలి ఆ నీటిని వడపోసి పోయాలి) అలా చేయడం వల్ల చంద్రుడు వల్ల ఏర్పడే బాధలు తగ్గుతుంది. బెల్లం కలిపిన నీళ్ళు ని మంగళవారం రోజు కలబందలో పోయాలి( ఒక గ్లాసు నీళ్ళలో ఒక చిన్న బెల్లం ముక్క వేసి కలిపి పోయాలి) అలా పోయడం వల్ల అంగారకుడి వల్ల ఏర్పడే బాధలు తగ్గుతాయి. బుధవారం రోజు తేనె కలిపిన నీటిని కలబంద చెట్టు లో పోస్తే బుధ గ్రహం వల్ల ఏర్పడే దోషాలు తొలగిపోతాయి.(ఒక గ్లాసు నీళ్ళలో ఒక స్పూను తేనె కలిపిన నీళ్లను పోయాలి). ఇలా కలబంద చెట్టులో పోసె నీళ్ళ వల్ల కూడా తాంత్రిక పరిహారం చేసుకోవచ్చు. కానీ ఈ పరిహారం ఈ మూడురోజులుతప్పవేరేరోజుఫలించదు.కలబంద ని ఇంటి ముందు పెట్టడం వల్ల నెగటివ్ ఎనర్జీ మీ ఇంటి లోపలికి రాకుండా చూసుకుంటుంది దిష్టి పరిహారం గా కూడా పనిచేస్తుంది

ఈ చెట్టుని ఇంటి ముందర భాగం లోనే కాకుండా ఇంటి వెనుక భాగం లో కూడా ఉంచుకోవచ్చు. ఇలా ఉంచుకోవడం వల్ల నేగటివ్ వైబ్రేషన్ రాకుండా ఉంచ గలుగుతుంది

మీకు తెలిసే ఉంటుంది కలబంద లో ఉండే జెల్ క్యాన్సర్ జబ్బును కూడా నయం చేయగలదు అలాగే ఫేస్ జెల్గా కూడా పనిచేస్తుంది సనాతన ధర్మ పరిరక్షకుడు ఆడెపు రాజమలి తెలిపారు

# జగ్గయ్యపేట డిపోలో డిపో మేనేజర్ మొండి వైఖరి

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:



జగ్గయ్యపేట డిపోలో డిపో మేనేజర్ మొండి వైఖరి, ఏకపక్ష నిర్ణయాలు మరియు డిపోలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎంప్లాయీస్ యూనియన్ ధర్నా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, డిపో అధ్యక్షులు క్రిష్ణారావు, జిల్లా నాయకులు ఎస్ కె . హిమాము, సీసీస్ డెలిగేట్ నాగేశ్వరరావు, డిపో కార్యదర్శి ఏ . ఆనంద్, డ్రైవర్స్ కార్యదర్శి ఎస్ కె . జిలాని మరియు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

డిమాండ్లు:

1. చార్ట్ బుకింగ్ వద్ద అవినీతి అరికట్టాలలి.
2. కండక్టర్ డ్రైవర్ డ్యూటీ చార్ట్ లు ౧×-2 తో వేయించాలి.
3. సీనియారిటీ ప్రకారం ౫ణ లను వాడుకోవాలి.
4. పెండింగ్ ఇంక్రిమెంట్లు కలపాలి.
5. పెండింగ్ మెడికల్ బిల్లులు చెల్లించాలి.
6. బస్సులు పూర్తి స్థాయిలో రిపేర్ చేయాలని సరిపడా స్పేర్ పార్టులు తెప్పించాలి.
7. యూనియన్ తరపున ఇచ్చిన మెమోరాండం లోని అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ఏ . ఆనంద్ డిపో కార్యదర్శి ఈ యూ –జేపీటీ

# 27 లక్షల మందికి ఏకకాలంలో అల్పాహారం.. ప్రపంచంలో ఎక్కడా లేదు
# తెలంగాణలోనే తొలిసారి.. విద్యార్థుల పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి

**-బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు.. మళ్లీ వచ్చేది ఎందుకో చెప్పాలి**
**-సంక్షేమం ఉచితం కాదు.. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి పెట్టుబడి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6:

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం ఉచితం కాదని, అది రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటేనే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పత్తికి పెద్ద ఎత్తున తోడ్పడతారని, తద్వారా జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తారని చెప్పారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మునగాల గ్రామంలో పాఠశాలల విద్యార్థుల కోసం రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. 1,020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి పరిశుభ్రమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పాహారం అందించేందుకు మునగాలలో ఈ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

?రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామని చెప్పారు. ఇంటి వద్ద వంద మందికి వంట చేయడం కూడా కష్టమైన పరిస్థితుల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా లేదని, ఇది తెలంగాణ ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని అన్నారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తేనే వారు ఆరోగ్యవంతమైన మానవ వనరుగా ఎదుగుతారని చెప్పారు. అందుకే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు చిన్ననాటి నుంచే నాణ్యమైన ఆహారం అందిస్తూ, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని వివరించారు.

సంక్షేమం ఉచితం కాదు.. పెట్టుబడే

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా చూడొద్దని భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులపై చేస్తున్న ఖర్చు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తిరిగి ప్రయోజనం చేకూర్చే పెట్టుబడిగా అభివర్ణించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం, పిల్లలు చదువుకోవడం, మహిళలు ఆర్థికంగా ఎదగడం, రైతులకు పెట్టుబడి సాయం అందడం ద్వారా రాష్ట్ర ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాలన్నింటి అంతిమ లక్ష్యం పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగడమేనని అన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరిగి రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు.

బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదు

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో స్పందించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అవసరమైన సంక్షేమ



కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ వస్తామని చెబుతున్నారని, అసలు ఏం చేయడానికి వస్తున్నారో ప్రజలకు చెప్పాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ఆపడానికి వస్తారా? సన్నబియ్యం పంపిణీ నిలిపివేయడానికి వస్తారా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఆపడానికి వస్తారా? మహిళల వడ్డీలేని రుణాలు నిలిపివేయడానికి వస్తారా? పేద విద్యార్థులకు అందుతున్న ఆర్థిక సాయాన్ని ఆపడానికి వస్తారా? అని భట్టి ప్రశ్నించారు. ప్రజలు అమాయకులు కాదని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు.

నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని తీసుకురానున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమానికి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భద్రత కల్పించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతి కుటుంబం తమ కుటుంబానికి భద్రత ఉందనే ధైర్యంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దేశంలోనే ప్రత్యేకమైన పథకంగా ఇందిరమ్మ కుటుంబ బీమాను అమలు చేయనున్నట్లు తెలిపారు.

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే పాఠశాలలో ఒకే కుటుంబంలా చదువుకునేలా ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు క్రీడలు, స్టేడియం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు.

ప్రజలే మా కుటుంబం

కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలే తమ కుటుంబమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారని, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులు లభించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని భట్టి అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారాన్ని ప్రదర్శించడానికి కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతను నెరవేర్చడానికి పనిచేయాలని, ఆ కోవాలోనే ఉత్తం దంపతులు ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అభివర్ణించారు. మునగాల హెలిప్యాడ్ నుంచి సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన ప్రాంతం వరకు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు సుమారు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు.

# న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని
# న్యాయవాదులు నిరసన

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6:

జగ్గయ్యపేట సివిల్ కోర్టు నందు మంగళవారం న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్లో జీవోను అమలు చేయాలని కోరుతూ న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమంలో సెక్రెటరీ ఆర్ వి ఎల్ ప్రసాద్ సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్ గౌడ్, అన్నెపాక కాంతారావు, దామాల సంతోష్, పూలా నాగరాజు, ఆంజనేయులు, ప్రతాపరెడ్డి దాసరి నాగేశ్వరరావు, శ్రీను, జూనియర్ న్యాయవాదులు నరేష్, గురువుల రాజు,టీవీ కృష్ణ,గాంధీ,బిక్షమయ్య ,రాజశేఖర్, కలిసే రత్నబాబు




తదితరులు పాల్గొన్నారు.

# రాజేశ్వరరావుపేటలో రూ.26 లక్షలతో నూతన కల్వర్ట్ నిర్మాణానికి
# శంకుస్థాపన చేసిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6:

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వరరావుపేట గ్రామంలో రూ.26 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన కల్వర్ట్ నిర్మాణ పనులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల శంకుస్థాపన చేశారు.

గ్రామంలోని శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో కల్వర్టు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు, రైతులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కల్వర్టు నిర్మాణం పూర్తయితే శ్మశాన వాటికకు వెళ్లే దారి సౌకర్యవంతంగా మారడంతో పాటు గ్రామ ప్రజలు, రైతుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కృషి చేసినట్లు సమాచారం. అధికారులు రూ.26 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.

ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ఎరువుల పంపిణీ విజయవంతం, పకడ్బందీగా ఎరువుల సరఫరా -- మంత్రి తుమ్మల
# ఖరీఫ్‌లో రాష్ట్ర యాప్ ద్వారా 33.39 లక్షల మంది రైతులకు 128.18 లక్షల యూరియా

**బస్తాలు, కేంద్ర యాప్ ద్వారా 37.48 లక్షల మంది రైతులకు 104.99 లక్షల అన్ని రకాల ఎరువుల బస్తాల పంపిణీ**
**రైతులకు ఇబ్బందులు రావొద్దని ముందుగానే ఎరువుల అడ్వాన్స్ పొజిషనింగ్.. షిప్‌యార్డుల్లో ప్రత్యేక అధికారుల నియామకం**
**ఫార్మర్స్ రిజిస్ట్రీలో తెలంగాణ ముందంజ.. భవిష్యత్‌లో అన్ని పథకాలకు డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రాతిపదిక**
**రాష్ట్రంలో ప్రస్తుతం 2.33 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు.. గత ఏడాదితో పోలిస్తే భారీ పెరుగుదలలి**
**గత ఖరీఫ్ తో పోల్చుకుంటే 35 వేల టన్నుల వాడకం తక్కువ**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:

ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల పంపిణీ విజయవంతంగా జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తుగానే ఎరువులను పొజిషన్ చేయడం, షిప్‌మెంట్లను వేగంగా రాష్ట్రానికి తీసుకురావడం, ఫెర్టిలైజర్ యాప్ ద్వారా పంపిణీని పర్యవేక్షించడం వంటి చర్యలతో ఎరువుల పంపిణీని సక్రమంగా నిర్వహించామని మంత్రి పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే ఎరువుల లభ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తుగానే స్టాక్స్‌ను పొజిషన్ చేయడంతో పాటు, దిగుమతి చేసుకునే ఎరువుల విషయంలో షిప్‌యార్డుల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేశామని చెప్పారు. షిప్‌మెంట్లు ఆలస్యం కాకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేస్తూ, షిప్‌యార్డుల నుంచి రాష్ట్రానికి ఎరువులు త్వరితగతిన చేరేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.

**ఫెర్టిలైజర్ యాప్‌తో పంపిణీలో పారదర్శకత...**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసి, ఎరువుల పంపిణీ ప్రక్రియను డిజిటల్ విధానంలోకి తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా ఎక్కడ ఎంత ఎరువుల నిల్వ ఉంది.. ఎంత పరిమాణంలో బుకింగ్ జరిగింది.. ఎంత మేరకు రైతులు ఎరువులను కొనుగోలు చేశారు అనే వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఏర్పడిందన్నారు. అంతకుముందే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా యాప్‌ను సమర్థవంతంగా అమలు చేసి, ఎరువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో విజయం సాధించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో యూరియా పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన యూరియా యాప్ విజయవంతమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసేందుకు జాతీయ ఫెర్టిలైజర్ యాప్‌ను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు.

అయితే జాతీయ ఫెర్టిలైజర్ యాప్ ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయని మంత్రి చెప్పారు. ముఖ్యంగా రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల మ్యాపింగ్ పూర్తిగా అందుబాటులో లేకపోవడం వల్ల అక్కడక్కడా ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఈ సమస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టామని చెప్పారు.

మొత్తంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల పంపిణీ సంతృప్తికరంగా జరిగిందని, రైతులకు అవసరమైన ఎరువులు నేరుగా, సక్రమమైన విధానంలో అందేలా యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపట్టామని మంత్రి తెలిపారు.

**రాష్ట్ర, కేంద్ర యాప్‌ల ద్వారా పకడ్బందీగా ఎరువుల పంపిణీ.**

ఖరీఫ్–2026 సీజన్‌లో ఫెర్టిలైజర్ యాప్ ద్వారా 33.39 లక్షల మంది రైతులు ఎరువుల కోసం నమోదు చేసుకోగా, 142.08 లక్షల బస్తాలు బుక్ అయ్యాయని మంత్రి తెలిపారు. ఇందులో ఇప్పటికే 128.18 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేశారు. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ ఫెసిలిటేషన్ సిస్టం యాప్ ద్వారా 37.48 లక్షల~ు= కోడ్‌లు జనరేట్ కాగా, 141.88 లక్షల అన్ని రకాల ఎరవుల బస్తాలు బుక్ అయ్యాయి. ఇందులో 104.99 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేశారన్నారు.

**గత మూడేళ్లతో పోలిస్తే వానాకాలం ఎరువుల విక్రయాల వివరాలు**

2024–25 వానాకాలంలో యూరియా 9.66 లక్షల మెట్రిక్ టన్నులు, డీఏపీ 2.17 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 8.59 లక్షల మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 0.47 లక్షల మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్పీ
0.32 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

2025–26 వానాకాలంలో యూరియా 9.79 లక్షల మెట్రిక్ టన్నులు, ణూ్రా 2.38 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 8.97 లక్షల మెట్రిక్ టన్నులు, మీూ్రా 0.43 లక్షల మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్పీ0.34 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

2026–27 వానాకాలంలో యూరియా 9.44 లక్షల మెట్రిక్ టన్నులు, ణూ్రా 2.98 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 7.09 లక్షల మెట్రిక్ టన్నులు, ఎంఓపీ
మీూ్రా 0.49 లక్షల మెట్రిక్ టన్నులు, ాూ్రా 0.48 లక్షల మెట్రిక్ టన్నులు విక్రయాలు కోనుగోలు చేశారు అన్నారు.

ఈ ఖరీఫ్ లో పూర్తిగా యాప్ ద్వారా యూరియా మరియు ఎరువులు పంపిణీ చేయడంతో బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు తగ్గి, గత ఖరీఫ్ కంటే 35 వేల టన్నుల యూరియాను తక్కువగా వాడినట్టు తెలిపారు.

**ప్రస్తుతం రాష్ట్రంలో 2.33 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు**

రాష్ట్రంలో ప్రస్తుతం రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. యూరియా 2.33 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా, గత ఏడాది ఇదే సమయంలో కేవలం 0.50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నాయని చెప్పారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత యూరియా నిల్వలు గణనీయంగా మెరుగ్గా ఉన్నాయన్నారు.

అదేవిధంగా ప్రస్తుతం రాష్ట్రంలో డీఏపీ 0.39 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2.72 లక్షల మెట్రిక్ టన్నులు, మీూ్రా 0.36 లక్షల మెట్రిక్ టన్నులు, ాూ్రా 0.18 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అక్టోబర్‌లో 2 లక్షల ాామీల యూరియా సరఫరా లక్ష్యం

అక్టోబర్ నెలకు రాష్ట్రానికి మొత్తం 2.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా ప్రణాళిక ఉండగా, ఇప్పటివరకు 0.18 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా అయినట్లు మంత్రి తెలిపారు. ఇందులో దేశీయ ఉత్పత్తి ద్వారా 0.87 లక్షల మెట్రిక్ టన్నుల ప్రణాళిక ఉండగా, దిగుమతుల ద్వారా 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ప్రణాళిక ఉందన్నారు. అదేవిధంగా అక్టోబర్‌లో ణూ్రాకు సంబంధించి 0.30 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా ప్రణాళిక ఉందని, ఇందులో దేశీయంగా 0.06 లక్షల మెట్రిక్ టన్నులు, దిగుమతుల ద్వారా 0.24 లక్షల మెట్రిక్ టన్నుల ప్రణాళిక ఉందని తెలిపారు.

రైతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని డిజిటల్‌గా అందుబాటులోకి తీసుకురావడంలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమాలను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేస్తూ ఫార్మర్స్ రిజిస్ట్రీని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇక వ్యవసాయ రంగంలో మరో కీలకమైన డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియను కూడా రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతు ఏ పంట సాగు చేస్తున్నాడు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నాడు అనే ఖచ్చితమైన సమాచారం డిజిటల్ విధానంలో అందుబాటులో ఉంటే, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన రైతులకు మరింత సమర్థవంతంగా అందించవచ్చన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేలో 75.9 శాతం పూర్తి...

వానాకాలం 2026–27కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేలో ఇప్పటివరకు 1,93,25,309 వ్యవసాయ క్షేత్రాలను సర్వేకు కేటాయించగా, 1,46,67,370 క్షేత్రాల సర్వే పూర్తయింది. మొత్తం 75.9 శాతం సర్వే పూర్తయినట్లు రాష్ట్రవ్యాప్తంగా 10,164 మంది వాలంటీర్లు రిజిస్టర్ కాగా, 9,820 మంది యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని సర్వే ప్రారంభించారు. అక్టోబర్ 5న ఒక్క రోజులోనే 2,69,597 వ్యవసాయ క్షేత్రాల సర్వే పూర్తయిందని తెలిపారు. కొన్ని జిల్లాల్లో 95 శాతం పూర్తి కాగా.. రంగారెడ్డి, మేడ్చల్ వంటి జిల్లాల్లో తక్కువగా ఉంది. ఇందులో కూడా తెలంగాణ రాష్ట్రం ముందువరుసలో ఉందని తెలిపారు. అంతేగాక, భవిష్యత్తులో డిజిటల్ క్రాప్ సర్వే ఆధారంగానే పంటల కొనుగోళ్లు, యాంత్రీకరణ, సబ్సిడీపై విత్తనాల పంపిణీ వంటి అన్ని పథకాలు వర్తింప చేస్తామని మంత్రి తెలిపారు.

# సూరారం గ్రామంలో అండర్ పాస్ కోసం ప్రజల నిరసన:
# తక్షణమే నిర్మాణం చేపట్టాలని డిమాండ్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:

మండలం ఎల్కతుర్తి సూరారం గ్రామంలో అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ స్థానిక ప్రజలు భారీ ఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ ప్రాంతంలో అండర్ పాస్ లేకపోవడం వల్ల నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం గుండా వెళ్లే ప్రధాన రహదారి కారణంగా ఊరు రెండు భాగాలుగా విడిపోయింది. సరైన క్రాసింగ్ లేదా అండర్ పాస్ లేకపోవడంతో నిత్యం ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని రోడ్డు దాటాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని గ్రామస్తులు గుర్తు చేశారు.



ఈ నేపథ్యంలోనే ప్రజలంతా ఏకమై నిరసన బాట పట్టారు. రహదారిపై బైఠాయించి, ప్రభుత్వానికి మరియు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "మాకు అండర్ పాస్ కావాలి - మా ప్రాణాలు కాపాడాలి" అంటూ ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి, సూరారం గ్రామంలో అండర్ పాస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం ఆపేది లేదని స్థానిక నాయకులు హెచ్చరించారు

# అలసట నీదే.. గమ్యమూ నీదే.. నిరాశ వదిలి విజయ తీరాలకు..




**ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:**

ఒక వ్యక్తి తన స్నేహితునితో ఇలా చెప్తున్నాడు "నేను పదవ తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి బాగా మార్కులు సాధిస్తా అనుకున్నాను. కానీ నేను ఊహించినన్ని మార్కులు రాలేదు. అలాగే ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో కూడా నేను ఊహించినట్టుగా నా ఫలితాలు రాలేదు. మంచి ఉద్యోగంలో స్థిరపడాలనుకున్నాను. కానీ నా కుటుంబాన్ని పోషించే స్తోమత కోసం చాలా కష్టపడాల్సి వస్తుంది. నేను ఊహించినట్టుగా ఏదీ జరగట్లేదు. నా ఈ 40 ఏళ్ల జీవితం వృధా అయినట్టుగా అనిపిస్తుంది. ప్రతిరోజు రాత్రి ఇవే ఆలోచనలు వస్తున్నాయి. నాకు సరిగ్గా నిద్ర పట్టడం లేదు. ఇక నా జీవితం అంతా ఇంతేనా?" అంటూ తన బాధని స్నేహితునితో పంచుకున్నాడు. వెంటనే అది విన్న అతని స్నేహితుడు ఒక ప్రశ్న అడిగాడు. "ప్రపంచంలో ఇలా ఊహించనిది నీ ఒక్కడికే జరుగుతుందా?"అని.

సహజంగా మనకు ఏదైనా సమస్య వస్తే ఎందుకిలా జరిగింది? ఇప్పుడే ఎందుకు జరిగింది? నాకే ఎందుకు జరిగింది? అనే ఈ మూడు ప్రశ్నలకు సమాధానాలు వెతికే పనిలోనే ఉండిపోతాం. ఇది సమస్యకు పరిష్కారం కాదు కేవలం ఆ సమస్యను పంచనామా చేస్తున్నట్టు మాత్రమే.. కానీ ఆ సమయంలో " ఇప్పుడు నేను ఏం చేయాలి?" అనే నాలుగవ ప్రశ్న మన మెదడులోకి రావాలి. ఆ ప్రశ్న మనల్ని సమస్య పరిష్కారం వైపుకు నడిపిస్తుంది.

ఈ భూమి మీద ఎవరైనా అన్నీ నేర్చుకున్న తర్వాతే పుట్టరు. కాలం గడుస్తున్న కొద్దీ సంఘటనల ద్వారా, అనుభవాల ద్వారా నేర్చుకుంటూ మరింత మెరుగవుతారు.

"పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తాయని ఊహించలేదు" అని పైన చెప్పిన కథలో ఒక వ్యక్తి తన స్నేహితుడితో చెప్పాడు కదా.. నిజంగా ఆ వ్యక్తికి ఎన్ని మార్కులు వస్తాయో ముందే తెలిసి ఉంటే అసలు ఆ వ్యక్తి పరీక్షకు ప్రిపేర్ అయ్యేవాడా? మనం చూసే సినిమాలో తరువాత రాబోయే సన్నివేశాలు అన్నీ మనకు మన పక్కన కూర్చున్న వ్యక్తి ముందే చెప్పేస్తూ ఉంటే సినిమాని మనం ఎంజాయ్ చేయగలమా? ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ మనలో ఉంటేనే ఆ చూసే సినిమా ని మనం ఎంజాయ్ చేయగలం.

అలాగే జీవితంలో జరగబోయే సంఘటనలు, దాని ఫలితాలు అన్నీ మనం ఊహించినట్టుగానే జరిగితే అప్పుడు మన జీవితం కూడా ఎలాంటి ఆస్వాదన లేకుండా చప్పగా గడిచిపోతుంది.

మన జీవితమంటే విధితో కలిసి చదరంగం ఆడటం లాంటిది. విధి ఒక ఎత్తు వేస్తే దానికి అనుగుణంగా మనం గెలిచేందుకు మరో ఎత్తు గురించి ఆలోచించాలి. అంతేగాని ఆట గురించి బెంబేలెత్తిపోయి ఇక ఆడలేనని, నిరాశలోకి వెళ్లిపోతే ఆటలో గెలవలేము. మన జీవితం ఒకే ఒక్కసారి మనకు లభించిన గొప్ప అవకాశం. ఎన్నిసార్లు కింద పడినా మళ్లీ లేచి గెలుపు కోసం పరిగెత్తాల్సిందే.

ఒక్కొక్కసారి మనం అనుకున్నవి అనుకున్నట్టుగా జరగకపోవచ్చు, కొన్ని రోజులు ఆలస్యం కావచ్చు, పూర్తిగా మనం అనుకున్నదానికి భిన్నంగా కూడా జరగవచ్చు. మనకు ఒకటి మంచిది అని మనం ఊహిస్తాము కానీ దాని కన్నా ఇంకా ఉత్తమమైనది మనకు జరగాలని దేవుడి నిర్ణయం అయి ఉండొచ్చు. అందుకే మనం ఆశించింది జరగకపోవచ్చు. అది ఎందుకు జరగలేదు, అది జరగకపోవడం వలన భవిష్యత్తులో మనకు ఎలాంటి ఉపయోగకరంగా మారబోతుందనేది మనకు తెలిసేంతవరకు కాస్త ఓపిక పట్టి ఎదురు చూడాలి. ఈలోపే నిరాశకు లోనై, మన శక్తిని మనం తక్కువ అంచనా చేసుకోవద్దు. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు.

జరిగిన సంఘటనలో మనం నేర్చుకోవలసిన విషయం ఏమైనా ఉందా? అని ఒక్కసారి ఆలోచించుకోవాలి. మనం అనుకోనిది జరిగినప్పుడు లేదా మనం ఆశించింది జరగనప్పుడు మన ఆలోచనలో గాని, మన ప్రవర్తనలో గాని ఏవైనా మార్పులు అవసరమా అనేది ఒక్కసారి మనకి మనము ప్రశ్నించుకోవాలి. అప్పుడు అలాంటి సంఘటన మరోసారి జరగకుండా చూసుకోవచ్చు. అంతేగాని, ఇది ఫలానా వాళ్ళ వలనే జరిగింది, ఇది నా దురదృష్టం వల్ల జరిగింది అంటూ ఇతరుల మీదికి నెపంవేసి కూర్చోవద్దు.

ఒక పడవ సముద్రంలోకి వెళ్లకుండా ఒడ్డునే ఉంటే అది చాలా సురక్షితంగా ఉంటుంది. కానీ ఆ పడవ అసలు సముద్రంలోకి వెళ్ళనప్పుడు ఆ పడవ ఉపయోగం ఏముంటుంది? అలాగే రాలిన ఆకులే రాబోయే కొత్త చిగురింపుకు సాక్షాలు అవుతాయి. మన జీవితంలో మనం ఊహించని మన ఓటములే మరొక వినూత్నమైన ఆలోచన, ముందడుగు ద్వారా కొత్త విజయానికి నాంది పలుకుతాయి. కాబట్టి, జరిగిన ప్రతి సంఘటన మన విజయం వైపుకు మలుపు తిప్పేలా మన ఆలోచన ఉండాలి. నిరాశను దాటి విజయతీరాలకు చేరాలి.

చివరిగా ఒక్క మాట:

జీవితం ఒక ప్రయాణం లాంటిది. దారంతా ఎన్నో మలుపులు ఉంటాయి. ఎన్నోసార్లు అలసిపోవచ్చు కానీ గమ్యాన్ని చేరాల్సింది మనమే. మన అలసట అనేది గమ్యం వైపు వెళ్లకుండా ఆపకూడదు.

అమావాస్య నాటికి కనుమరుగైన చంద్రుడే మళ్లీ 15 రోజుల్లో పౌర్ణమి నాటికి నిండు వెన్నెలను అందించగలుగుతాడు. ప్రతిరోజు తన కిరణాలతో మనల్ని నిద్రలేపే సూర్యుడే సాయంత్రం అయ్యేసరికి అస్తమిస్తాడు, ఒక్కోసారి గ్రహణానికి గురవుతాడు.

ఎవరికైనా ఓటములు, ఒడిదుడుకులు అత్యంత సహజం. వాటిని దాటిన వాడికే గెలుపు తథ్యం.

M. Jaya Krishna Reddy
M.S. (Counselling & Psychotherapy)
Motivational Speaker
Cell: 9640 21 55 41

విజయ బాబు మాట్లాడుతూ సప్త స్వరాలు సుశీల్సిగానం లో పలుకుతాయి అని చెప్పారు గాయని ఆమని పట్ల అభిమానం తో పదహారు సార్లు ఆమె కార్యక్రమాలకు రావటం విశేషం అని తెలిపారు సుశీల మాట్లాడుతూ వృధాప్యం లో వున్న సంగీత కళాకారులు వేరే ఉపాధి వారికి లేదనీ వారికోసం ట్రస్ట్ ప్రారంభించడం జరిగింది కానీ ఆర్థిక వనరులు లేక మూసి వేత లో ఉన్న ట్రస్ట్ ను అమనీ తిరిగి తెరిపించే ప్రయత్నం లో ప్రభుత్వ ఆర్థిక సాయం అందిస్తున్నందుకు ధన్య వాదాలు తెలిపారు వేదిక పై కుసుమ భోగరాజు బి ఎస్ వి వి ఎస్ మూర్తి వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు ఆమని చంద్ర తేజ మల్లెల వసుంధర మానస హనుమంత్ రావు తదితరులు సుశీల సుముఖం గానం చేయగా ఆమె తన అభిప్రాయాలు తెలిపి వారిని అభినందించారు

# ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**

రాహుల్‌గాంధీతోపాటుప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌ల అరెస్టును ఖండించిన ముఖ్యమంత్రి ప్రజాస్వామ్యపరిరక్షణకుఅహింసాయుతంగాఉద్యమిస్తున్నాయకులను బలవంతంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అరెస్టులు, జైళ్లు, లాఠీఛార్జీలు గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ నేతలకు కొత్త కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అరెస్టులు చేసి, జైళ్లలో పెట్టినంత మాత్రాన ఎన్నికల కమిషన్ తప్పులపై కాంగ్రెస్ పోరాటం ఆపదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సర్ తప్పిదాలకు సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ విశ్రమించదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.



# ఎరువుల దుకాణంలో ఏజీ ఆడిట్ బృందం తనిఖీ...



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**

: గొల్లప్రోలు మండలంలోని స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్ ఎరువుల దుకాణాన్ని ఏజీ ఆడిట్ బృందం మంగళవారం తనిఖీచేసింది.ఎరువులనిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. రికార్డుల్లో నమోదైన వివరాలకు అనుగుణంగానే స్టాక్ ఉన్నట్లు తనిఖీల్లో నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం బృందం తదుపరి తనిఖీల కోసం కిర్లంపూడి మండలానికి వెళ్లింది. ఈ తనిఖీల్లో ఏజీ ఆడిటర్ జి. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె.వి.వి. సత్యనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారి చంటిబాబు పాల్గొన్నారు.

# 27 లక్షల మందికి ఏకకాలంలో అల్పాహారం.. ప్రపంచంలో ఎక్కడా లేదు
## తెలంగాణలోనే తొలిసారి.. విద్యార్థుల పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి

**బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు.. మళ్లీ వచ్చేది ఎందుకో చెప్పాలి**
**సంక్షేమం ఉచితం కాదు.. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి పెట్టుబడి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూవేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం ఉచితం కాదని, అది రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటేనే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పత్తికి పెద్ద ఎత్తున తోడ్పడతారని, తద్వారా జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తారని చెప్పారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మునగాల గ్రామంలో పాఠశాలల విద్యార్థుల కోసం రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. 1,020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి పరిశుభ్రమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పాహారం అందించేందుకు మునగాలలో ఈ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామని చెప్పారు. ఇంటి వద్ద వంద మందికి వంట చేయడం కూడా కష్టమైన పరిస్థితుల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా లేదని, ఇది తెలంగాణ ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని అన్నారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తేనే వారు ఆరోగ్యవంతమైన మానవ వనరుగా ఎదుగుతారని చెప్పారు. అందుకే పేద, మధ్యతరగతి



కుటుంబాల పిల్లలకు చిన్ననాటి నుంచే నాణ్యమైన ఆహారం అందిస్తూ, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని వివరించారు.

సంక్షేమం ఉచితం కాదు.. పెట్టుబడే

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా చూడొద్దని భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులపై చేస్తున్న ఖర్చు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తిరిగి ప్రయోజనం చేకూర్చే పెట్టుబడిగా అభివర్ణించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం, పిల్లలు చదువుకోవడం, మహిళలు ఆర్థికంగా ఎదగడం, రైతులకు పెట్టుబడి సాయం అందడం ద్వారా రాష్ట్ర ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాలన్నింటి అంతిమ లక్ష్యం పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగడమేనని అన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరిగి రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు.

బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదు

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో స్పందించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ వస్తామని చెబుతున్నారని, అసలు ఏం చేయడానికి వస్తున్నారో ప్రజలకు చెప్పాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ఆపడానికి వస్తారా? సన్నబియ్యం పంపిణీ నిలిపివేయడానికి వస్తారా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఆపడానికి వస్తారా? మహిళల వడ్డీలేని రుణాలు నిలిపివేయడానికి వస్తారా? పేద విద్యార్థులకు అందుతున్న ఆర్థిక సాయాన్ని ఆపడానికి వస్తారా? అని భట్టి ప్రశ్నించారు. ప్రజలు అమాయకులు కాదని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు.

నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని తీసుకురానున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమానికి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భద్రత కల్పించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతి కుటుంబం తమ కుటుంబానికి భద్రత ఉందనే ధైర్యంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దేశంలోనే ప్రత్యేకమైన పథకంగా ఇందిరమ్మ కుటుంబ బీమాను అమలు చేయనున్నట్లు తెలిపారు.

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే పాఠశాలలో ఒకే కుటుంబంలా చదువుకునేలా ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ మీడియం విద్యతో పాటు క్రీడలు, స్టేడియం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు.

ప్రజలే మా కుటుంబం

కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలే తమ కుటుంబమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారని, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులు లభించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని భట్టి అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారాన్ని ప్రదర్శించడానికి కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతను నెరవేర్చడానికి పనిచేయాలని, ఆ కోవాలోనే ఉత్తం దంపతులు ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అభివర్ణించారు. మునగాల హెలిప్యాడ్ నుంచి సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన ప్రాంతం వరకు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు సుమారు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు.

# బస్సులో పరిచయం.. ప్రేమ పేరుతో మోసం
## రూ.20 లక్షల వరకు నగదు, బంగారం తీసుకున్నాడని ఆరోపణ

**- కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఆర్‌ఎంకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశం**
**- ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం**

**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6:**

చంద్రగిరి మండలం కొంగరవారిపల్లెకు చెందిన ఎం. బేబీ శాలిని తనకు ఎదురైన సమస్యను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి తనకు జరిగిన పరిణామాలను వివరించి, న్యాయం చేయాలని కోరారు.

బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తాను చంద్రగిరి నుంచి తిరుపతికి ప్రతిరోజూ బస్సులో ప్రయాణించే క్రమంలో ఆర్టీసీ కండక్టర్ వి. సుబ్రహ్మణ్యంతో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఆ పరిచయాన్ని క్రమంగా పెంచుకున్న సుబ్రహ్మణ్యం తనను ప్రేమిస్తున్నానని నమ్మించి, తనను మోసం చేశాడని ఆరోపించారు. ప్రేమ పేరుతో తనపై నమ్మకం కలిగించిన అనంతరం వివిధ దశల్లో తన నుంచి సుమారు రూ.20 లక్షల వరకు నగదును తీసుకున్నాడని ఆరోపించారు. ఫోన్‌పే ద్వారా పలుమార్లు నగదు బదిలీ చేయించుకున్నాడని, తనతో



బంగారం కూడా కొనిపించుకున్నాడని తెలిపారు. తన వద్ద నుంచి తీసుకున్న నగదు, బంగారం తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడని వాపోయారు. అదేవిధంగా, తనను ప్రేమిస్తున్నానని చెబుతూ తన వెంటపడి, తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు. ఈ పరిణామాలతో తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, తనకు న్యాయం చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. తన వద్ద ఉన్న ఫోన్‌పే లావాదేవీల వివరాలు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, బంగారం కొనుగోలుకు సంబంధించిన బిల్లులు, ఇతర ఆధారాలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**తిరుపతి ఆర్‌ఎంకు మంత్రి వీడియో కాల్**

బాధితురాలు తన సమస్యను వివరించిన వెంటనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తిరుపతి ఆర్టీసీ ఆర్‌ఎం (రీజినల్ మేనేజర్)కు వీడియో కాల్ చేసి సమస్యను వివరించారు. బాధితురాలు చేసిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపించాలని, సంబంధిత కండక్టర్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు సేవ చేయాల్సిన ఆర్టీసీ సిబ్బంది తమ విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రయాణికులతో ముఖ్యంగా మహిళలతో మర్యాదగా, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇలాంటి ఆరోపణలు ఎదురైనప్పుడు విషయాన్ని తేలికగా తీసుకోకుండా నిజానిజాలను పూర్తిస్థాయిలో విచారించి, తప్పు చేసినట్లు తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎంను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, సిబ్బంది ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

బాధితురాలికి చట్టపరంగా న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. మహిళల భద్రత, గౌరవానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, బాధితులకు అండగా ఉంటామని మంత్రి స్పష్టం చేశారు.

# వాచ్ వ్యాపారిని కత్తితో బెదిరించి రూ.9.50 లక్షలు దోచుకున్న దుండగుడు.

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6:**

వ్యాపార లావాదేవీలకు సంబంధించిన నగదుతో వెళు‌_న్న వాచ్ వ్యాపారిని గుర్తు తెలియని ఓ అగంతుకుడు కత్తితో బెదిరించి రూ.9.5 లక్షల నగదు దోచుకెళ్లిన ఘటన గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. అగంతకుడు వ్యాపారి మెడపై కత్తిని పెట్టి, నగదు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించడంతో ప్రాణ భయంతో వ్యాపారి చేతిలోని నగదు గల బ్యాగును కింద పడేయడంతో దుండగుడు అందు లోని నగదు తీసుకుని పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోషామహల్ ప్రాంతా నికి చెందిన కేవల్మ్ (45) గత కొంతకాలంగా బేగంబజార్ లో గడియారాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం అజమ్ ఎస్టేట్ 3వ అంతస్తు నుంచి వ్యాపారానికి సంబంధించిన బకాయిలు వసూలు చేసుకుని, అజీజ్ ప్లాజా వైపు వస్తుండగా వెనుక



నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియ ని అగంతకుడు కత్తితో వ్యాపారిని బురిడికొట్టించాడు.

తన వద్ద గల నగదు ఇవ్వా లని వ్యాపారిని బెదిరిస్తూ, వ్యాపారి కేవల్రామ్ మెడపై కత్తిని ఆనించాడు. దీంతో భయాందోళనలకు గురైన కేవల్మ్ ప్రాణ భయంతో నగదు బ్యాగును కింద పడేయడంతో అగంతకుడు బ్యాగ్లో గల రూ. 9.5 లక్షల నగదుతో పరారయ్యాడు. అగంతకుడి నుంచి తనను తాను కాపాడుకునేందుకు వ్యాపారికి, అగంతకుడికి మధ్య జరిగిన పెనుగులాటలో వ్యాపారి కే వల్రామ్కు మెడ, చేతులకు గాయమై రక్తస్రావం జరిగింది. ఈ మేరకు సమాచారం అందుకున్న గోషామహల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. సీసీ కెమెరా పుటేజీల్లో దృ శ్యాలను వీక్షించి, వ్యాపారిపై దాడి చేసి, నగదుతో ఉడాయించిన అగంతకుడు బహదూర్పురా ప్రాంతానికి చెందిన జహీర్ (35)గా పోలీసుల దర్యా పులో తేల్చారు. అతను అజమ్ ఎస్టేట్లోని ఓ దుకాణంలో వాచ్ రిపేర్ చేసే వ్యక్తి అని గుర్తించిన పోలీసులు నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందా లను రంగంలోకి దింపి, గాలింపు చర్యలు ముమ్మురం చేసినట్లు పోలీసులు తెలిపారు.

## డిఫరెంట్ థ్రిల్లర్ మూవీ "మయూఖ"ను ఓవర్సీస్ లో రిలీజ్ చేస్తున్న కాగ్నెయిర్ సినీ క్రియేషన్స్

## ఈ నెల 9న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న "మయూఖ" సినిమా

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "మయూఖ". ఈ చిత్రాన్ని ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై శశిధర్ నల్ల నిర్మిస్తున్నారు. శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహిస్తున్నారు. "మయూఖ" సినిమా ఈ నెల 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్ర ఓవర్సీస్ రిలీజ్ అప్డేట్ ఇచ్చారు.

కాగ్నెయిర్ సినీ క్రియేషన్స్ సంస్థ "మయూఖ" చిత్రాన్ని ఓవర్సీస్ లో భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతోంది. డిఫరెంట్ థ్రిల్లర్ సినిమాగా తెరకెక్కిన "మయూఖ" ప్రమోషనల్ కంటెంట్ తోనే ప్రేక్షకుల దృష్టిని బాగా ఆకర్షించింది. ఒక మంచి సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ను థియేటర్స్ లో చూడబోతున్న ఫీల్ ఈ చిత్ర ట్రైలర్ తోనే అందరిలో కలిగింది. మరోవైపు ఈ నెల 9న రిలీజ్ కావాల్సిన వెంకటేష్, త్రివిక్రమ్ ఆదర్శ కుటుంబం సినిమా పోస్ట్ పోన్ కావడంతో "మయూఖ"పై మరింత క్రేజ్ పెరిగింది. థ్రిల్లర్స్ ఇష్టపడే ప్రేక్షకులతో పాటు కొత్త తరహా సినిమా చూడాలనుకునే మూవీ లవర్స్ కు ఈ వీకెండ్ "మయూఖ" సినిమా బెస్ట్ ఆప్షన్ గా కనిపిస్తోంది.

నటీనటులు – పాయల్ చెంగప్ప, బిగ్ బాస్ ఫేమ్ అమన్ మసూద్, దేవ్ డి, మురలీధర్ గౌడ్, లావణ్య రాణి, చరిశ్మ దబ్బార, జాను వర్మ, నానాజీ కర్రి, రఘు వాసిరెడ్డి, అభిలాష్ అడ్డ, వి.ఎస్. రాజు, మది నస్రీన్, బేబి మాన్వీ, మాస్టర్ షణ్ముఖ చరణ్, శశి కదిరి, రాంబాబు రామిశెట్టి, పవన్ లక్కిరెడ్డి, మణిసాయి, సత్య విఠల్, ప్రశ్విత చౌదరి




నల్లా, వేగి నాయుడు, శ్రీధర్, మణికంఠ

టెక్నీషియన్స్

---------------------

ఆర్ట్ – బ్రహ్మనాథ్ ఎ పాటిల్
కాస్ట్యూమ్స్ – లావణ్య రాణి కాండ్రేగుల
ఎడిటర్ – శరత్. జె
డీవోపీ – ఫర్హాన్ వడక్కం
మ్యూజిక్ – శిబి మాత్యూ అలెక్స్
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ – డి.గిరీష్ రెడ్డి
లైన్ ప్రొడ్యూసర్ – తేజ తోట
కో ప్రొడ్యూసర్ – మనోజ్ పోల
ప్రొడ్యూసర్ – శశిధర్ నల్ల
డైరెక్టర్ – శ్రీ తేజ్ ఎస్ కే
డిజిటల్ పీ ఆర్ ఓ : సూరపనేని మురళి కృష్ణ
పీఆర్ఓ – గాంద్ల శ్రీనివాస్ ( జి. ఎస్. మీడియా )

## మహారాష్ట్రలో భారీగా విస్తరిస్తున్న అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్





ముంబై: అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ (AAFA) మహారాష్ట్ర రాష్ట్ర కమిటీని ముంబైలో జరిగిన కార్యక్రమంలో అధికారికంగా ఏర్పాటు చేశారు. దీంతో మహారాష్ట్రలో AAFA కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయి.

రాష్ట్ర కమిటీతో పాటు పరభణి, నాందేడ్, ముంబై, పుణే, పాలం, హింగోలి, ఉమ్రి, సోలాపూర్, గడ్చిరోలి, షిర్డీ జిల్లాల్లో మొత్తం 10 జిల్లా కమిటీలను ఏర్పాటు చేశారు.

సామాజిక బాధ్యతలో భాగంగా AAFA ఆధ్వర్యంలో న్యూఎ పై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. HPV నివారణ, వ్యాక్సినేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యం.

మహారాష్ట్రలో AAFA నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడంతో పాటు, అభిమానులను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని కొత్తగా ఏర్పాటైన కమిటీలు పనిచేయనున్నాయి. "ప్రతి సంవత్సరం ఒక మంచి పని" అనే AAFA లక్ష్యానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలను కొనసాగించనున్నారు.

## జయ్ దేవరకొండ--రష్మిక 'రణబాలి'పై భారీ అంచనాలు.. అక్టోబర్ 16న థియేటర్లలోకి







హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా లిలి'రణబాలి'లిలిపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. అక్టోబర్ 8న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అక్టోబర్ 16న సినిమా థియేటర్లలోకి రానుంది. సినిమా టికెట్ ధరల పెంపుపై వస్తున్న వార్తలను నిర్మాతలు ఖండిస్తూ సాధారణ టికెట్ ధరలతోనే విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు.

## దసరా బరిలో బడా సినిమాలు.. టాలీవుడ్‌లో ఆసక్తికర పోటీ






హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

దసరా పండుగ సీజన్ టాలీవుడ్‌కు ఈసారి మరింత ప్రత్యేకంగా మారుతోంది. పలు భారీ చిత్రాలు వరుసగా థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. స్టార్ హీరోల సినిమాలతో పాటు చిన్న, మధ్యతరహా చిత్రాలు కూడా బాక్సాఫీస్ పోటీలో నిలుస్తున్నాయి. పండుగ సెలవులను క్యాష్ చేసుకునేందుకు నిర్మాతలు విడుదల తేదీలను ప్లాన్ చేస్తున్నారు. ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, హారర్, కామెడీ తదితర జానర్లలో సినిమాలు రాబోతున్నాయి. దీంతో అక్టోబర్ సినిమా సీజన్‌పై టాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది

## 'అనకాపల్లి' దసరా ధమాకాగా నిలుస్తుంది - థాంక్యూ మీట్‌లో లగడపాటి శ్రీధర్

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

ఈ రోజు కూడా అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి – థాంక్యూ మీట్‌లో నటుడు, నిర్మాత, దర్శకుడు త్రినాథరావు నక్కిన

'అనకాపల్లి' లాంటి మంచి చిత్రానికి సరైన సంఖ్యలో థియేటర్లు ఇవ్వకపోవడం బాధగా ఉంది – థాంక్యూ మీట్‌లో నటి ఇంద్రజ

భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నటిస్తూ, నిర్మించిన రా అండ్ రస్టిక్ చిత్రం 'అనకాపల్లి'. ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాండ్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి త్రినాథరావు నక్కిన కథ, స్క్రీన్ ప్లేని అందించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయగా అద్భుతమైన స్పందనతో దూసుకుపోతోంది. ఈ క్రమంలో మంగళవారం నాడు థాంక్యూ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో..

త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ .. "అనకాపల్లి' సినిమాకి నేను డబ్బులేమీ పెట్టలేదు. నా పేరు పెడితే ఎవరైనా చూసేందుకు వస్తారని అలా పెట్టారు. సోమవారం వరకు రిజల్ట్ కోసం వెయిట్ చేశాను. సోమవారమే కాదు.. ఈ రోజు (మంగళవారం) కూడా మంచి ఫ్లోటింగ్ ఉంది. అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. సినిమాకు అన్ని వైపుల నుంచి రెస్పాన్స్ వస్తోంది. పర్ఫామెన్స్ పరంగా ఆర్టిస్టులందరికీ మంచి పేరు వస్తోంది. ఈ సినిమాని ఇలానే మరింత ముందుకు తీసుకు వెళ్లాలని మీడియా, ఆడియెన్స్‌ని కోరుకుంటున్నాను' అని అన్నారు.

లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ .. "అనకాపల్లి' సక్సెస్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. విక్రమ్ నా కొడుకు అవ్వడం, అతని మీద ఒక సినిమా తీయడానికి త్రినాథ్ రావు గారు, నాయుడు గారు ముందుకు రావడం గొప్ప విషయం. ఇలాంటి చిన్న చిత్రాలకు మీడియానే ముందుండి సపోర్ట్ చేస్తుంది. 'ఎవడిగోలవాడిదే' సినిమాని ఫస్ట్ వీక్‌కే తీసేస్తామని అన్నారు. కానీ అదే థియేటర్లో చివరకు సిల్వర్ జూబ్లీ జరిగింది. అలానే 'అనకాపల్లి' కూడా గొప్ప విజయాన్ని సాధిస్తుంది. దసరా ధమాకాగా 'అనకాపల్లి' నిలుస్తుంది. మండే నైట్ షోలు కూడా ఫుల్స్ అయ్యాయి. నూకాలమ్మ తల్లి ఆశీస్సులతో 'అనకాపల్లి' చిత్రం మరింత విజయాన్ని సాధిస్తుందని కోరుకుంటున్నాను' అని అన్నారు.



కాండ్రేగుల నాయుడు మాట్లాడుతూ .. 'త్రినాథరావు నక్కిన గారి మీదున్న నమ్మకంతోనే 'అనకాపల్లి' చేశాను. రెండు వందల థియేటర్లలో మా మూవీని రిలీజ్ చేశాం. మేం ఎంతో కష్టపడి ఈ సినిమాని చేశాం. ఇంత మంచి ఆదరణ లభిస్తున్న ఈ సినిమాకి కాకుండా ఇతర భాషల చిత్రాలకు థియేటర్లను ఇస్తున్నారు. మంచి చిత్రాలతో మా లాంటి చిన్న నిర్మాతలు వచ్చినప్పుడు సపోర్ట్ ఇవ్వాలని అందరినీ కోరుకుంటున్నాను. ఈ రోజు కూడా మా సినిమాకి చాలా చోట్ల హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. మేం మంచి మూవీని తీశాం. మా చిత్రానికి ఇంకా థియేటర్లు ఇవ్వాలని డిస్ట్రిబ్యూటర్లను కోరుతున్నాను' అని అన్నారు.

విక్రమ్ సహిదేవ్ మాట్లాడుతూ .. "అనకాపల్లి' సినిమాకి మంచి రెస్పాన్స్ వస్తోంది. రివ్యూలన్నీ చదివాను. మా ప్లస్, మైనస్ పాయింట్స్ చెప్పిన అందరికీ థాంక్స్. ఇంకా మా చిత్రానికి థియేటర్లు పెరుగుతున్నాయి. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన త్రినాథరావు గారికి థాంక్స్. ఇంద్రజ గారి వల్లే ఫ్యామిలీ డ్రామా అంత గొప్పగా వచ్చింది. దేవ్‌జండ్ గారి మ్యూజిక్ అదిరిపోయింది. తారక్ పొన్నప్ప గారితో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. సంధ్య వశిష్ట చక్కగా నటించింది. ఈ జర్నీలో మా నిర్మాతలు నాయుడు గారు, రాజా గారు ఫ్యామిలీ మెంబర్లుగా మారిపోయారు. వారితో మున్ముందు కలిసి ప్రయాణించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

నటి ఇంద్రజ మాట్లాడుతూ .. "అనకాపల్లి' అసలు సిసలు విజయాన్ని సాధించింది. అందుకే ఈ రోజు ఈ థాంక్యూ మీట్‌కి వచ్చాను. ఇలాంటి మంచి చిత్రానికి సరైన సంఖ్యలో థియేటర్లు ఇవ్వకపోవడం బాధగా ఉంది. చూసిన ప్రతీ ఒక్కరూ సినిమా బాగుందని మెచ్చుకుంటున్నారు. సినిమాలో ఎవరున్నారు? ఎవరు తీశారు అన్నది పట్టించుకోవడం లేదు. బాగుందా? లేదా? నచ్చిందా? లేదా? అన్నది మాత్రమే ఆడియెన్స్ చూస్తున్నారు. మా సినిమాకి మరిన్ని మంచి థియేటర్లు లభిస్తాయని ఆశిస్తున్నాను. ఓటీటీలో కూడా మా మూవీని చూడండి. కానీ అప్పుడు థియేటర్లో చూడలేకపోయామనే ఫీల్ అవుతారు. మా చిత్రం అంత అద్భుతంగా ఉంటుంది' అని అన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ మాట్లాడుతూ .. "అనకాపల్లి' ఊహకు భిన్నంగా ఉంటుంది. ఇంటర్వెల్, క్లైమాక్స్ సర్ ప్రైజింగ్‌గా ఉన్నాయి. రొటీన్‌కి భిన్నంగా ఈ చిత్రం సాగుతుంది. విక్రమ్ గొప్పగా నటించాడు' అని అన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ శివ మాట్లాడుతూ .. "అనకాపల్లి' చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తోంది. విక్రమ్ గొప్పగా నటించాడు. శ్రీధర్ గారికి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. దర్శకుడు ఈ చిత్రాన్ని గొప్పగా తెరకెక్కించారు. ఇలాంటి గొప్ప చిత్రాలు, మంచి నిర్మాతలు రావాలి' అని అన్నారు.

## ఈ నెల 16న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న "క్రేజీ కల్యాణం" మూవీ

ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు.

ఈ నెల 30న "క్రేజీ కల్యాణం" సినిమా రిలీజ్ కావాల్సి ఉండగా రెండు వారాల ముందుగానే ఈనెల 16వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ కొత్త రిలీజ్ డేట్ ను మేకర్స్ ఈరోజు అనౌన్స్ చేశారు. "క్రేజీ కల్యాణం" సినిమా ప్రమోషనల్ కంటెంట్ తోనే మూవీ లవర్స్ దృష్టిని బాగా ఆకర్షించింది. ఈ చిత్రంలోని లిరికల్ సాంగ్స్ కూడా చాట్ బస్టర్స్ అయ్యాయి. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ లోనూ ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి.

నటీనటులు – నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, తదితరులు



టెక్నికల్ టీమ్
కాస్ట్యూమ్ డిజైనర్ – జె.గాయత్రి దేవి
ఆర్ట్ డైరెక్టర్ – సాయి కదిర
ప్రొడక్షన్ డిజైనర్ – శ్రీపాల్ మాచర్ల
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ – అఖిల్ సాయి శ్రీమూర్తి
కొరియోగ్రాఫర్ – ఈశ్వర్ పెంటి
యాక్షన్ – డ్రాగన్ ప్రకాష్
లిరిక్స్ – గోరటి వెంకన్న, చైతన్య ప్రసాద్, కాసర్ల శ్యామ్
ఎడిటర్ – శ్రావణ్ కటికనేని
డీవోపీ – శ్యామ్ దూపాటి
మ్యూజిక్ – సురేష్ బొబ్బిలి
స్క్రీన్ ప్లే – శ్రీనివాస రవీంద్ర (ఎంఎస్ఆర్)
పీఆర్ఓ – సురేష్ (ఎస్ కె మీడియా)
ప్రొడ్యూసర్ – బూసం జగన్ మెహన్ రెడ్డి
స్టోరీ, స్క్రీన్ ప్లే , డైలాగ్స్, డైరెక్షన్ – బద్రప్ప గాజుల

## ప్రిన్స్ ధ్రువ సర్జా జోడీగా ఫుల్ ప్లెడ్జ్ లవ్ స్టోరీ "కెమిస్ట్రీ"తో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనున్న హీరోయిన్ నభా నటేష్



ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

హీరోయిన్ నభా నటేష్ మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రిన్స్ ధ్రువ సర్జా హీరోగా నటిస్తున్న కెమిస్ట్రీ సినిమాలో నభా హీరోయిన్ గా అలరించబోతోంది. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దర్శకుడు విశాల్ ఆత్రేయ రూపొందిస్తున్నారు. ఈ రోజు ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు.

కెరీర్ బిగినింగ్ లో రొమాంటిక్ మూవీస్ లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న నభా నటేష్ కొంత గ్యాప్ తర్వాత మళ్లీ ఈ జానర్ లో కెమిస్ట్రీ సినిమా చేస్తోంది. చాలా రోజుల తర్వాత ఒక కంప్లీట్ లవ్ స్టోరీలో కెమిస్ట్రీ సినిమాతోనే నభా కనిపించడం విశేషం. ధ్రువ సర్జా, నభా నటేష్ మధ్య ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ఈ సినిమాకు హైలైట్ గా నిలవనుంది. ఈ ఫ్రెష్ పెయిర్ ను తెరపై చూసేందుకు ఆడియెన్స్ వేచి చూస్తున్నారు. ఈ ఏడాది నాగబంధం సినిమాలో తన పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసింది నభా నటేష్.

## శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్, మహాయాన బ్యానర్స్ "అట్టహాసం" సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

' ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:

'క" వంటి బ్లాక్ బస్టర్ సినిమాను నిర్మించిన శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్ సంస్థ మహాయాన బ్యానర్ తో కలిసి "కేరాఫ్ కంచెరపాలెం" వంటి సూపర్ హిట్ సినిమా రూపొందించిన వెంకటేష్ మహా దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా "అట్టహాసం". ఈ సినిమాను చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి చింతా నిర్మిస్తున్నారు. చింతా వినీషా రెడ్డి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. "అట్టహాసం" చిత్రంలో వెంకటేష్ మహా, కార్తీక్ రత్నం, పావని కరణం, స్రవంతి పీపకాయల ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ రోజు "అట్టహాసం" సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో రెండు జంటలు కనిపిస్తున్నాయి. వారిలో ఒక జంటకు 'మాకు మోక్షం కావాలి...' అని, మరొక జంటకు 'మాకు ఉద్యోగం కావాలి..' అని క్యాప్షన్స్ రాయడం ఆసక్తి కలిగిస్తోంది.



రియల్, రూటెడ్, ఆంథెటిక్ ఎంటర్ టైనర్ గా "అట్టహాసం" సినిమా రూపొందుతోంది. వచ్చే ఏడాది సమ్మర్ లో ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ ఇవ్వబోతున్నారు.

నటీనటులు – వెంకటేష్ మహా, కార్తీక్ రత్నం, పావని కరణం, స్రవంతి పీపకాయల, తదితరులు

టెక్నీషియన్స్

----------------------------

మ్యూజిక్ – స్మరణ్ సాయి
సమర్పణ – చింతా వరలక్ష్మి
కో ప్రొడ్యూసర్ – చింతా వినీషా రెడ్డి
ప్రొడ్యూసర్స్ – చింతా గోపాలకృష్ణ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి చింతా నిర్మి
స్క్రిప్ట్, డైరెక్షన్ – వెంకటేష్ మహా
పీఆర్ఓ – సురేష్ (ఎస్ కే మీడియా)

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి: బీజేపీ చీఫ్..






**తార్నాక, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6 :**
రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ట్రాఫిక్ నిబంధనలను బాధ్యతగా పాటించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాం చందర్ రావు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం, ఆయన 25 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' లో భాగంగా మహంకాళి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మెట్టుగూడ మెట్రో స్టేషన్ సమీపంలోని స్కైలాబ్ హోటల్ వద్ద రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్. రాం చందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ఉపయోగించాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను గౌరవించడం, వేగ పరిమితులను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ ఉపయోగించడం, రాంగ్ రూట్ లో ప్రయాణించడం, అతివేగం, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉల్లంఘించడం వంటి చర్యలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. పాదచారులు సైతం రోడ్డు దాటే సమయంలో నిబంధనలు పాటించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రమాదాల నివారణకు ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల సహకారం కూడా అవసరమని నాయకులు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడే సామాజిక బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో చిలకలుగూడ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జగన్ రెడ్డి, సిబ్బంది, బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ మేకల సారంగపాణి, మహంకాళి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వై. సురేష్ కుమార్, బిజెపి మహంకాళి జిల్లా ఇంటలెక్చువల్ సెల్ ఇంచార్జ్ శ్రీరామ్ వెంకటేష్, నాయకులు వెంకట రమణి, టి. రాజశేఖర్ రెడ్డి, శారదా మల్లేష్, కె. నాగేశ్వర్ రెడ్డి, కె. అరవింద్ హరి, రవీందర్, భానుమతి, సంధ్య, మేకల కీర్తి, హర్ష కిరణ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జూన్ 2లోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**
సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల భూముల అంశంపై
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో సర్వే వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు అందజేశారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి... రెవెన్యూ అధికారుల సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించినట్లుగా అధికారులు ముఖ్యమంత్రి వివరించారు.
సర్వే నంబర్‌లో మిస్ అయిన 45 ఎకరాల భూమి వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 45 ఎకరాలు ఎక్కడుందో తేల్చాలని అధికారులను
ముఖ్యమంత్రి ఆదేశించారు. భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ విడుదల చేశామని, భూమి సరిహద్దులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రెవెన్యూ రికార్డులు సబ్మిట్ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సీఎం కు వివరించారు. సర్వే నంబర్ 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోందని సీఎం చెప్పారు. సర్వే నంబర్ 325లో



తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణం
చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు
తెలంగాణ అమరవీరుల కాలనీలో అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, సకల సౌకర్యాలతో కాలనీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.
జూన్ 2లోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు

# త్వరలోనే పీఆర్సీ అంశం పైఉద్యోగాలకు తీపి కబురు అందిస్తా -రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను కుటుంబ సభ్యులుగా చూస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏ శాఖ లోని ఉద్యోగి పైన తాము కక్ష్యపూరితంగా వ్యవహరించలేదని భవిష్యత్ లో కూడా వ్యవహరించబోమని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ రవీంద్రభారతి లో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం , రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ట్రెస్మా పూర్వ అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి పదవీ విరమణ ఆత్మీయ సన్మానం సభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. అయితే ఈ చట్టం ఆశించిన రీతిలో విజయం సాధించకపోయిన ప్రజల కోరిక మేరకు కొంత ఫలితాలు అయితే ఇవ్వగలిగామని ఆయన తెలిపారు. ప్రభుత్వాలు తీసుకుకొచ్చిన చట్టాలు మెరుగైన ఫలితాలు సాధించడంలో అధికారుల పాత్ర కీలకమైందని ఆయన అన్నారు. ఇటీవల ఉద్యోగులకు రెండు డీఏలు ప్రకటించమని, త్వరలోనే పీఆర్సీ అంశం పై మంత్రి వర్గ సమావేశంలో చర్చించి ఉద్యోగాలకు తీపి కబురు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. వీఆర్ఏ, ఎంఆర్వో లకు సంబంధించిన సమస్యలపై త్వరలోనే రెవిన్యూ శాఖ కార్యదర్శి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం మీద ఉద్యోగుల మీద కొంత మంది ఉద్దేశ పూర్వకంగా గుడ్డ కాల్చి మీద వేస్తున్నారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. ఇటువంటి తటాకు చప్పుళ్లకు ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులు బెదరబోమన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించిన వైద్య బిల్లల ఫైల్స్ ను గత ప్రభుత్వం పెండింగు లో పెడితే తాను మంత్రి గా రాగానే ఆ బిల్స్ మంజూరు చేశానని మంత్రి గుర్తు చేశారు. రెవిన్యూ శాఖ లోని 17 మంది ఉద్యోగులకు కన్ఫర్డ్ ఐఏఎస్ లుగా పదోన్నతి, శాఖ లోని వివిధ హోదాల్లో పదోన్నతులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో
టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు, ట్రెస్మా రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్ రమణా రెడ్డి, ఏపీ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డిప్యూటీ కలెక్టర్, చంద్రకళతోటు రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# తొలి స్వదేశీ ఫ్లీట్ సపోర్ట్ షిప్ 'ఐఎన్ఎస్ సూర్య'ను ప్రారంభించిన రాజ్‌నాథ్ సింగ్

**ఎఫ్ఎస్ఎస్--1 ప్రారంభం విజయానికి చిహ్నం..**
**ఎఫ్ఎస్ఎస్--5 కీల్ వేయడం సంకల్పానికి నిదర్శనం**
**హెచ్ఎస్ఎల్‌ను నాణ్యత, ఉత్పాదకత, సకాలంలో డెలివరీకి ప్రమాణంగా తీర్చిదిద్దాలి**
**విశాఖపట్నాన్ని ప్రధాన సముద్ర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలి**

**న్యూ ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 6:**
హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)లో నిర్మించిన తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్ఎస్ఎస్--1)ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం ప్రారంభించారు. ఐదో ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్ఎస్-ఎస్--5)కు కీల్ వేశారు. ఆధునీకరించిన స్లిప్‌వే--4, 300 టన్నుల సామర్థ్యమున్న గొలియత్ క్రేన్‌ను కూడా ప్రారంభించారు. పెద్ద, సంక్లిష్టమైన నౌకలను నిర్మించే హెచ్ఎస్ఎల్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, స్వదేశీ సముద్ర రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం కీలక ముందడుగుగా నిలిచింది.
ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "ఎఫ్ఎస్ఎస్--1 ప్రారంభం సాధనకు చిహ్నం. ఎఫ్ఎస్ఎస్--5కు కీల్ వేయడం సంకల్పానికి నిదర్శనం. కొత్త స్లిప్‌వే మనం పెంచుకుంటున్న సామర్థ్యానికి ప్రతీక" అని అన్నారు. ఈ మూడు కార్యక్రమాలు విడివిడిగా సాధించిన విజయాలకే పరిమితం కావని, భారత సముద్ర శక్తికి పునాది మరింత బలోపేతం అవుతోందని పేర్కొన్నారు.
స్వతంత్ర భారతదేశంలో నిర్మించిన తొలి నౌక 'జల ఉష'ను 1948లో విశాఖపట్నంలో ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేసిన రక్షణ మంత్రి, భారతదేశానికి సముద్రంతో అనుబంధం ప్రాచీన కాలం నుంచే ఉందన్నారు. ఎనిమిది దశాబ్దాలకు పైగా దేశ సముద్ర, రక్షణ అవసరాలకు సేవలందిస్తున్న హెచ్ఎస్ఎల్ జాతీయ సముద్ర నిర్మాణ సామర్థ్యానికి సంరక్షక సంస్థ అని కొనియాడారు. రక్షణ శాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత సంస్థ సాధించిన ప్రగతికి, నిరంతర కృషికి గుర్తింపుగా 2025లో మినీరత్న కేటగిరీ--1 హోదా లభించిందని తెలిపారు.

**నౌకాదళానికి మరింత దూరం, కార్యాచరణ సామర్థ్యం**
ఫ్లీట్ సపోర్ట్ షిప్‌లు హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత నౌకాదళం కార్యకలాపాల పరిధి, సముద్రంలో ఎక్కువకాలం కొనసాగగల సామర్థ్యం, కార్యాచరణ ప్రభావాన్ని పెంచుతాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సుదూర సముద్ర ప్రాంతాల్లో పనిచేసే నౌకాదళానికి యుద్ధనౌకలతో పాటు సరఫరా, నిర్వహణ, నిరంతర మద్దతు అవసరమని వివరించారు. సముద్రంలోనే ఇంధనం, ఇతర అవసరమైన సరఫరాలు అందించడం ద్వారా ఫ్లీట్ సపోర్ట్ షిప్‌లు ఈ అవసరాలను తీరుస్తాయని చెప్పారు.
నేవీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు లైలా స్వామినాథన్ సంప్రదాయ కార్యక్రమాల అనంతరం ఎఫ్ఎస్ఎస్--1 'సూర్య'ను ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన వారి హర్షధ్వానాల మధ్య నౌక బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. హెచ్ఎస్ఎల్‌లోనే స్వదేశీ పరిజ్ఞానంతో రూపకల్పన



చేసి నిర్మించిన ఈ నౌకల్లో అధిక సరకు, ద్రవ పదార్థాల నిల్వ సామర్థ్యం, ప్రాథమిక నిర్వహణ వర్క్‌షాప్‌లు, బహుళ ప్రయోజన హెలికాప్టర్ల కోసం డెక్, ఆత్మరక్షణ వ్యవస్థలు ఉంటాయి.

**భారీ నౌకల నిర్మాణానికి ఆధునిక వసతులు**
హెచ్ఎస్ఎల్ ఆధునీకరించిన స్లిప్‌వే--4ను 45 వేల డీడబ్ల్యూటీ వరకు సామర్థ్యమున్న నౌకలను నిర్మించి, సముద్రంలోకి ప్రవేశపెట్టేలా విస్తరించి బలోపేతం చేశారు. స్లిప్‌వేలు--3, 4 మీదుగా విస్తరించిన 300 టన్నుల గొలియత్ క్రేన్‌ను మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద ఎల్అండ్‌టీ జియోస్ట్రక్చర్, కోనెక్రేన్స్ రూపొందించి, తయారు చేశాయి.
పీఎల్‌సీ నియంత్రణలు, వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్‌లు, జంట లిఫ్టింగ్ సదుపాయం, రిమోట్ డయాగ్నస్టిక్స్, కండిషన్ మానిటరింగ్ వ్యవస్థలతో ఈ క్రేన్ భారీ నౌకా భాగాలను వేగంగా, కచ్చితత్వంతో తరలించేందుకు తోడ్పడుతుంది. ఆధునిక బ్లాక్ నిర్మాణ పద్ధతితో పెద్ద, సంక్లిష్టమైన నౌకా నిర్మాణ కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ వసతులు హెచ్ఎస్ఎల్ సామర్థ్యాన్ని పెంచుతాయి.

**విశాఖపట్నాన్ని సముద్ర పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దాలి**
స్వావలంబన సాధించడం ముఖ్యమైన మైలురాయే అయినప్పటికీ, అంతర్జాతీయ పోటీలో నిలవడం తదుపరి లక్ష్యమని రక్షణ మంత్రి అన్నారు. నాణ్యత, ఖర్చు, సాంకేతికత, సకాలంలో సరఫరా, విశ్వసనీయత వంటి అంశాల్లో భారత నౌకా నిర్మాణ సంస్థలు ప్రపంచంలోని ప్రముఖ షిప్‌యార్డులతో పోటీ పడాలని పిలుపునిచ్చారు.
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వ్యవస్థతో హెచ్ఎస్ఎల్ మరింతగా అనుసంధానం కావాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు సరఫరాదారులుగా, విశ్వవిద్యాలయాలు పరిశోధన, నైపుణ్యాభివృద్ధిలో భాగస్వాములుగా, సాంకేతిక సంస్థలు డిజిటల్ నౌకా నిర్మాణంలో, స్టార్టప్‌లు సముద్రసాంకేతికత అభివృద్ధిలో తోడ్పడవచ్చన్నారు. హెచ్ఎస్ఎల్ చుట్టూ రవాణా, పోర్టు వసతులు, పరిశోధన, సాంకేతికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో సమగ్ర నౌకా నిర్మాణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని అన్నారు.
తూర్పు నౌకాదళ కమాండ్, నేవల్ డాక్‌యార్డ్, హెచ్ఎస్ఎల్, విశాఖపట్నం పోర్టు ఉండటంతో నగరానికి సమగ్ర సముద్ర వ్యవస్థగా ఎదిగే పునాది ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. నౌకాదళ నైపుణ్యం, నౌకా నిర్మాణ సామర్థ్యం, ఇంజినీరింగ్ ప్రతిభ, పోర్టు వసతులు, నైపుణ్య మానవ వనరులను ఒకచోట చేర్చి విశాఖపట్నాన్ని ప్రధాన సముద్ర పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నౌకాదళం, హెచ్ఎస్ఎల్, డీఆర్‌డీవో, విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. "భారత సముద్ర శక్తిని నౌకాదళం లేదా షిప్‌యార్డులు మాత్రమే నిర్మించలేవు" అని అన్నారు.
"మెరుగైన రూపకల్పన చేయాలి, వేగంగా నిర్మించాలి, సకాలంలో అందించాలి, సమర్థంగా నిర్వహించాలి, మరమ్మతులను సమర్థవంతంగా చేపట్టాలి" అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గత దశాబ్దంలో దేశ రక్షణ తయారీ రంగం గణనీయంగా మారిందని, అధునాతన వ్యవస్థలు, వేదికల స్వదేశీ రూపకల్పన, తయారీపై దృష్టి పెరిగిందని తెలిపారు. సకాలంలో సరఫరా, ఉత్పాదకత, స్వదేశీ రూపకల్పన సామర్థ్యం, సరఫరా వ్యవస్థ పటిష్ఠత, నైపుణ్య మానవ వనరులు, ఉత్పత్తి సామర్థ్యం, వ్యయ పోటీతత్వం దేశ నౌకా నిర్మాణ రంగం అంతర్జాతీయంగా ఎదగడానికి కీలకమని చెప్పారు.
హెచ్ఎస్ఎల్‌లో సకాలంలో డెలివరీని సంస్థాగత సంస్కృతిగా మార్చుకోవాలని, ప్రపంచంలోని ప్రముఖ షిప్‌యార్డుల నుంచి నేర్చుకోవాలని, స్వదేశీ రూపకల్పన సామర్థ్యాన్ని పెంచాలని, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లతో భాగస్వామ్యాలు బలోపేతం చేయాలని సూచించారు. నౌకల నిర్మాణంతో పాటు వాటి జీవితకాల నిర్వహణ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని, నౌకాదళం--షిప్‌యార్డుల మధ్య సమన్వయాన్ని పెంచాలని అన్నారు.
భారత నౌకా నిర్మాణ సంస్థలు స్నేహపూర్వక దేశాలు, అంతర్జాతీయ మార్కెట్లకు సేవలందించే స్థాయికి చేరాలని రక్షణ మంత్రి ఆకాంక్షించారు. సముద్ర సాంకేతికత, నౌకల మరమ్మతులు, నిర్వహణ సేవలు, ఇంజినీరింగ్ నైపుణ్యంలో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాలు, మౌలిక వసతుల అభివృద్ధి శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ మతుకుమిల్లి, రక్షణ ఉత్పత్తుల కార్యదర్శి సంజీవ్ కుమార్, తూర్పు నౌకాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, కోస్ట్ గార్డ్ తూర్పు తీర కమాండర్ అదనపు డైరెక్టర్ జనరల్ డోనీ మైఖేల్, హెచ్ఎస్ఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రియర్ అడ్మిరల్ సి. రఘురామ్ (రిటైర్డ్), నౌకాదళం, రక్షణ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన న్యాయశాఖ

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 6:**
స్వచ్ఛతపై స్వచ్ఛంద సేవ, సమష్టి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర న్యాయశాఖ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు 'స్వచ్ఛతా హి సేవా--2026' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఏడాది "స్వచ్ఛతలో భాగస్వామ్యం -- స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్" అనే ఇతివృత్తంతో ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. సెప్టెంబరు 17న న్యాయశాఖ కార్యదర్శి నీరజ్ వర్మ అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు శ్రమదాన కార్యక్రమాల్లో పాల్గొని తమ విభాగాలు, ఉమ్మడి ప్రదేశాలు, మెట్లు, గోడలు, టైల్స్ తదితర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణం మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇండోర్ మొక్కల కుండీలకు రంగులు వేశారు.
కార్యక్రమ కాలంలో వదులుగా ఉన్న విద్యుత్ తీగలు, పనిచేయని నీటి కుళాయిలు, విరిగిన ఫర్నిచర్, మరమ్మతులు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర పరికరాలను సాధ్యమైనచోట



మరమ్మతు చేయడం లేదా మార్చడం చేపట్టారు. సాధారణ నిర్వహణ, రోజువారీ శుభ్రతలో తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్యాలయ పైకప్పులు, నీటి ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు వివిధ గదుల్లోని తెరలను ఉతికించడం లేదా మార్చడం వంటి పనులు చేపట్టారు.
సెప్టెంబరు 25న 'స్వచ్ఛత కోసం క్రీడలు' కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా రన్, డార్ట్ బోర్డు ఆట నిర్వహించారు.
అక్టోబరు 1న న్యాయ, న్యాయశాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శాఖలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమానికి నాయకత్వం వహించారు. న్యూఢిల్లీలోని జైసల్మేర్ హౌస్ ముందున్న ప్రాంగణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు పుష్పాంజలిఘటించికార్యక్రమాలనుప్రారంభించారు. అనంతరం "ఒక రోజు, ఒక గంట, ఒకేసారి" కార్యక్రమాన్ని నిర్వహించగా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ జైసల్మేర్ హౌస్ ప్రాంగణంలో "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం కింద మొక్కలు నాటారు.
స్వచ్ఛతా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శాఖలోని పారిశుద్ధ్య కార్మికులకు మంత్రి స్వచ్ఛతా కిట్‌లను అందజేశారు. వాటిలో శానిటైజర్, చేతి తొడుగులు, హ్యాండ్ టవల్, టీషర్టులు, టోపీలు తదితర వస్తువులు ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికులకు 'స్వచ్ఛతా సమ్మాన్' అందించడంతో పాటు, స్వచ్ఛతా క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.
స్వచ్ఛతా హి సేవా--2026 కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది చురుకుగా పాల్గొని చేసిన కృషిని న్యాయ, న్యాయశాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) అభినందించారు.

# 21 కిలోమీటర్ల ఎత్తులో హై ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ ప్రయోగం విజయవంతం గాలికంటే తేలికైన దీర్ఘకాలిక వైమానిక నిఘా వ్యవస్థ

**ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్: అక్టోబర్ 6:**
స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన హై ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ (హెచ్ఏపీ)ను డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగ విమానం సముద్ర మట్టానికి 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరి, 20 కిలోమీటర్ల ఎత్తులో 30 నిమిషాలకు పైగా ఉండి, ఆదేశాల మేరకు తిరిగి భూమికి దిగింది. వ్యవస్థను సురక్షితంగా తిరిగి స్వాధీనం చేసుకున్న అనంతరం విమాన పనితీరు సమాచారాన్ని విశ్లేషించారు.
పరీక్ష సమయంలో గగనతల వేదిక నుంచి ప్రత్యక్ష వీడియోతో పాటు ఇతర వాహన పారామీటర్లను గ్రౌండ్‌కంట్రోల్‌స్టేషన్‌లో నిరంతరం స్వీకరించారు. అందిన సమాచారం, నిర్దేశించిన విధంగా ప్లాట్‌ఫామ్ పనిచేసినట్లు చూపించింది. ఇందులో ఇనర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) రిసీవర్, ఆన్‌బోర్డ్ కెమెరాలు, ఎత్తు నియంత్రణ వ్యవస్థతో పాటు పలు ఎలక్ట్రానిక్‌పరికరాలు,ఉపవ్యవస్థలనుఅమర్చారు.
భారత వైమానిక దళం, సీఈఎంఐఎల్ఏసీ, డీజీసీఏ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), ఇతర పౌర అధికార సంస్థల సమన్వయంతోఈ ప్రయోగం నిర్వహించారు.ఎత్తైన వాతావరణ పొరల్లో దీర్ఘకాలం పనిచేస్తూ వైమానిక నిఘా అందించగల గాలికంటే తేలికైన వ్యవస్థగా హెచ్ఏపీని అభివృద్ధి చేస్తున్నారు. ఆగ్రాలోని ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడీఆర్‌డీఈ) ఈ ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తోంది. హై ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ విమాన పరీక్ష విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీఓ, వైమానిక దళం, ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమ వర్గాలను అభినందించారు. దీర్ఘకాలిక స్ట్రాటోస్ఫియరిక్ ఎయిర్‌షిప్ అభివృద్ధి దిశగా ఈ విజయం ఆత్మనిర్భర్ భారత్ ప్రయాణంలో కీలక మైలురాయి అని పేర్కొన్నారు. విమాన పరీక్షలో పాల్గొన్న బృందాలకు రక్షణ కార్యదర్శి, రక్షణ పరిశోధన, అభివృద్ధి శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేశ్ కుమార్ సింగ్ అభినందనలు తెలిపారు.

## దుర్గాపూజ పందిళ్లలో బెంగాల్ సంస్కృతి.. కళా వైభవానికి అద్దం పడుతున్న ప్రత్యేక థీమ్స్





**న్యూఢిల్లీ: ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**
ఈ ఏడాది దుర్గాపూజ సందర్భంగా దేశ రాజధాని పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పందిళ్లు బెంగాల్ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సంప్రదాయ చేనేత, గ్రామీణ జీవనం, చారిత్రక కట్టడాలు, కళలు, సినిమా వంటి విభిన్న అంశాలను ఆధారంగా చేసుకుని పందిళ్లను రూపొందిస్తున్నారు. వెదురు నిర్మాణాలు, హస్తకళలు, రంగురంగుల అలంకరణలు, విద్యుత్ దీపాలతో పందిళ్లు ప్రత్యేక ఆకర్షణగా మారుతున్నాయి. ఈసారి దుర్గాపూజ అక్టోబర్‌లో దేశవ్యాప్తంగా సాంస్కృతిక సందడిని తీసుకురానుంది.

## . తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బతుకమ్మ.. అక్టోబర్ 10 నుంచి 18 వరకు వేడుకలు




**హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మను ట్యాంక్‌బండ్‌పై భారీ స్థాయిలో నిర్వహించనున్నారు. వేలాది మంది మహిళలు బతుకమ్మలతో పాల్గొననుండగా, వందలాది మంది కళాకారులతో సంప్రదాయ కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్‌బండ్ వరకు బతుకమ్మలతో ప్రత్యేక ఊరేగింపు చేపట్టనున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లను పూల బతుకమ్మలతో అలంకరించడంతో పాటు విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

## విజయవాడ ఉత్సవ్‌కు రంగం సిద్ధం.. 10 రోజుల పాటు కళా, సాంస్కృతిక సందడి




**విజయవాడ: ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 06:**
ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని దేశానికి పరిచయం చేసేలా విజయవాడ ఉత్సవ్ 2026 నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్ 11 నుంచి 20 వరకు జరిగే ఈ పది రోజుల ఉత్సవంలో స్థానిక సంప్రదాయాలు, జానపద కళలు, సంగీతం, నృత్యం, ఆహార సంస్కృతి తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. "వన్ సిటీ--వన్ సెలబ్రేషన్" భావనతో నగరాన్ని సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేలా కార్యక్రమాలను రూపొందించారు. కళాకారులు, ప్రజలు, పర్యాటకులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ ఉత్సవం ప్రధాన ఉద్దేశంగా ఉంది.









## సుమధుర గీతాలతో అలరించిన ఆర్‌కే ఎంటర్‌టైనర్స్ కార్యక్రమం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 6:**
ఆర్‌కే ఎంటర్‌టైనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుమధుర గీతాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో ఉన్న కళా సుబ్బారావు కళావేదికపై జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు గాయనీగాయకులు తమ పాటలతో ప్రేక్షకులను అలరించారు. గాయనీమణులు శ్రీమతి కల్పన, రాజ్యలక్ష్మి, పావని, ఇందిర, కిరణ్మయి, పావని చిట్టా; గాయకులు మురళి, రామ సుబ్రహ్మణ్యం,



రవిప్రసాద్, జగదీష్, మహాదేవ్ గీతాలు ఆలపించారు. కార్యక్రమానికి ఆర్‌కే ఎంటర్‌టైనర్స్



వ్యవస్థాపకులు, బహుముఖ గాయకులు డా. శంకర్ రామిసెట్టి వ్యాఖ్యాతగా వ్యవహరించారు

## రామ్కీ మెలోడీస్' ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి

**హైదరాబాద్, చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ 6 :**
రమ్కీ మెలోడీస్ ఆధ్వర్యంలో 'నెల నెల వంశీ సంగీతోత్సవంలో భాగంగా 'పాట పాడుమా కృష్ణా' పేరిట సినీ సంగీత విభావరి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా లలిత కళా వేదికలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వంశీ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీ రామరాజు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాన కళా సార్వభౌమ' వై.ఎస్. రామకృష్ణ



నిర్వహణలో ప్రముఖ సంగీత దర్శకులు ఎస్. రాజేశ్వర రావు సంగీతం సమకూర్చిన మధుర



గీతాలను గాయని గాయకులు ఆలపించి శ్రోతలను అలరించారు.

## సుశీల ఏర్పాటు చేసిన కళా కారులు సంక్షేమ ట్రస్ట్ కు ఆర్థిక సహాయం





**హైదారాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్ అక్టోబరు 6:**
విఖ్యాత గాయని పి సుశీల కళా కారుల సంక్షేమం గురించి ఏర్పాటు చేసిన ట్రస్ట్ కు తెలంగాణ ప్రభుత్వం ఏభై లక్షల నగదు మంజూరు చేస్తున్నారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ఆదర్శ ఫౌండేషన్ అర్ ఆర్ ఫౌండేషన్ నిర్వహణలో పద్మ విభూషణ్ అవార్డ్ గ్రహీత డాక్టర్ పి సుశీల లకు పౌర సన్మానం గాయనీ గాయకుల ఆనందోత్సాహాలు మధ్య గాన భరితం గా జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ మాట్లాడుతూ సుశీల తెలుగు జాతి సంపద అని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆమె పాటలు భవిష్యత్ తరాలకు అందేలా నిక్షిప్తం చేయాలని కోరారు అధ్యక్షత వహించిన సమాచార హక్కు చట్టం పూర్వ ముఖ్య కమిషనర్ పి విజయ బాబు



మాట్లాడుతూ సప్త స్వరాలు సుశీల్సిగానం లో పలుకుతాయి అని చెప్పారు గాయని ఆమని పట్ల అభిమానం తో పదహారు సార్లు ఆమె కార్యక్రమాలకు రావటం విశేషం అని తెలిపారు సుశీల మాట్లాడుతూ వృధాప్యం లో వున్న సంగీత కళాకారులు వేరే ఉపాధి వారికి లేదనీ వారికోసం ట్రస్ట్ ప్రారంభించడం జరిగింది కానీ ఆర్థిక వనరులు లేక మూసి వేత లో ఉన్న ట్రస్ట్ ను అమనీ తిరిగి తెరిపించే ప్రయత్నం లో ప్రభుత్వ ఆర్థిక సాయం అందిస్తున్నందుకు ధన్య వాదాలు తెలిపారు వేదిక పై కుసుమ భోగరాజు బి ఎస్ వి వి ఎస్ మూర్తి వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు ఆమని చంద్ర తేజ మల్లెల వసుంధర మానస హనుమంత్ రావు తదితరులు సుశీల సుముఖం గానం చేయగా ఆమె తన అభిప్రాయాలు తెలిపి వారిని అభినందించారు

## ఈశాన్య భారత కళలకు ప్రత్యేక వేదిక.. 250 మందికి పైగా జానపద కళాకారుల ప్రదర్శనలు




జైపూర్: ఈశాన్య భారతదేశంలోని సంప్రదాయ కళలు, జానపద నృత్యాలు, వస్త్రధారణ, హస్తకళలకు ఆక్టేవ్ 2026 వేదికగా నిలిచింది. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాల కళా సంప్రదాయాలను ఈ ఉత్సవంలో ప్రదర్శించారు. 250 మందికి పైగా జానపద కళాకారులు పాల్గొని తమ ప్రాంతీయ నృత్యాలు, సంగీతాన్ని ప్రదర్శించారు. మణిపురి రాస్, అసోం



సత్రియా, సిక్కిం సంప్రదాయ నృత్యాలు, త్రిపుర



హోజాగిరి వంటి కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి

Edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136